


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 320, పేజీలు - 08

ఆదివారం, మే 10, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్





హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## - సీఎం రేవంత్ రెడ్డి నయా ప్లాన్

- ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు
- పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్న సీఎం
- నగరాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా అభివృద్ధిని మూడు విభాగాలుగా విభజించుకున్నట్లు వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరాన్ని ప్రధానంగా వేధిస్తున్న సమస్య ట్రాఫిక్. రోజురోజుకూ విస్తరిస్తున్న నగరం, పెరుగుతున్న జనాభా, అలాగే పెరుగుతున్న వ్యక్తిగత వాహనాల సంఖ్య కారణంగా హైదరాబాద్‌ను ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. మాములు రోజులలో పోలిస్తే వర్షకాలంలో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. వర్షం పడితే చాలు రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ సిటీగా

2లో..

స్వాతంత్ర్యనంతరం తొలిసారిగా

# కొలువుదీరిన కాషాయం

- బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం
- కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా కార్యక్రమం
- సువేందు చేత ప్రమాణం చేయించిన గవర్నర్ ఆర్ ఎన్ రవి



కోల్‌కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో సరికొత్త శకం ఆరంభమైంది. రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా భారతీయ జనతా పార్టీ అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. బెంగాల్ నూతన ముఖ్యమంత్రిగా భీజేపీ ఫైర్‌బ్రాండ్ నేత సువేందు అధికారి శనివారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని చారిత్రక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ వేడుకలో గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆయన చేత పదవీ స్వీకార ప్రమాణం చేయించారు.

### - దిగ్గజాల సమక్షంలో వేడుక..

ఈ అపూర్వ ఘట్టానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, కింజరాపు

2లో..

# బండికి 'సన్' స్ట్రోక్

లైంగిక దాడి ఆరోపణలు

- బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు - హనీట్రాప్ అంటున్న భగీరథ్!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హనీ ట్రాప్ లో చిక్కుకున్నాడు. తనను ఒక కుటుంబం హనీ ట్రాప్ చేసి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తుందని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తెలంగాణ రాష్ట్రంలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

### - హనీ ట్రాప్ ఆరోపణలు చేస్తూ బండి సంజయ్ కుమారుడి ఫిర్యాదు

భగీరథ్ ఫిర్యాదు ప్రకారం హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన ఓ యువతితో గత కొంతకాలం క్రితం స్నేహం ఏర్పడిందని, ఆ పరిచయం ద్వారా ఆమె కుటుంబ సభ్యులతో కూడా సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో పలుమార్లు కుటుంబ కార్యక్రమాలు, దేవాలయాల సందర్శనలకు కలిసి వెళ్లినట్లు తెలిపారు.

### - రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు ఫిర్యాదు

అయితే అనంతరం తనపై ఆ యువతిని పెళ్లి చేసుకోవాలని, పెళ్లి కోసం ఒత్తిడి తెచ్చారని, అంగీకరించకపోతే తప్పుడు కేసులు పెడతామని బెదిరించారని ఆరోపించారు. అలాగే తను ఆ యువతి తో మాట్లాడిన వీడియోలు, చాటింగ్ స్క్రీన్‌షాట్లతో బ్లాక్‌మెయిల్ చేస్తూ

2లో..

తమిళనాడు రాజకీయాల్లో

# ముగిసిన సస్పెన్స్

- నేడే ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం!



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో గత కొన్ని రోజులుగా నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెరపడింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరుతూ ఆయన చేసిన విజ్ఞప్తికి గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఆమోదం తెలిపారు. శనివారం సాయంత్రం చెన్నైలోని లోక్‌భవన్‌లో విజయ్ గవర్నర్ ఆర్లేకర్‌తో సమావేశమయ్యారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో,

2లో..

# ఫైల్స్ క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు

- ఫైల్స్ క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడుకు మొదటి ర్యాంకు
- పనితీరులో వెనుకబడ్డ మంత్రులు సవిత, పయ్యావుల, కొల్లు రవీంద్ర
- సీఎస్ సాయిప్రసాద్ పనితీరును ప్రత్యేకంగా అభినందించిన చంద్రబాబు




అమరావతి (ప్రశ్న న్యూస్) పాలనలో వేగం పెంచడంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. కీలకమైన ఫైళ్లను 24 గంటల్లోపు పరిష్కరించాలని, అప్పుడే ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతుందని స్పష్టం చేశారు. ఫైళ్ల క్లియరెన్స్ వేగమే 'స్పీడ్ ఆఫ్ దూయింగ్ గవర్నెన్స్'లో అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో మంత్రులు, కార్యదర్శులు, అధికారులకు ఆయన ఈ మేరకు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ పనితీరును మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ఈ-ఫైల్స్ పరిష్కార వేగం ఆధారంగా మంత్రులకు ర్యాంకులు ఇచ్చినట్లు తెలుస్తోంది. 2026 మార్చి 11 నుంచి మే 5 మధ్య కాలంలో ఫైళ్ల పరిష్కారానికి తీసుకున్న సమయాన్ని ప్రామాణికంగా తీసుకుని ఈ వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన సగటున కేవలం 2.49 గంటల్లోనే ఫైళ్లను పరిష్కరించడం విశేషం. ఆయన తర్వాత మంత్రి రామానాయుడు 7.37 గంటలతో రెండో స్థానంలో, టీజీ భరత్ 10.54 గంటలతో మూడో స్థానంలో ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సాయిప్రసాద్ పెద్ద సంఖ్యలో ఫైళ్లు వచ్చినా, సగటున 10 గంటల వ్యవధిలోనే పరిష్కరించడం పట్ల సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. అదే సమయంలో కొందరు మంత్రులు ఫైళ్ల పరిష్కారంలో వెనుకబడినట్లు ఈ నివేదిక వెల్లడించింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ఫైళ్లను క్లియర్ చేయడానికి సగటున 13 రోజుల సమయం తీసుకుంటూ జాబితాలో చివరి స్థానంలో నిలిచారు. ఆమె కంటే ముందు మంత్రి పయ్యావుల కేశవ్ 9 రోజుల 14 గంటలతో, మంత్రి కొల్లు రవీంద్ర 6 రోజుల 7 గంటలతో చివరి మూడు స్థానాల్లో ఉన్నారు. అయితే, ఈ ర్యాంకుల ప్రకటనపై ప్రతిపక్షాలు అనవసర రాజకీయం చేస్తున్నాయని భావించిన ముఖ్యమంత్రి, భవిష్యత్తులో మంత్రుల పనితీరుకు సంబంధించిన ర్యాంకులను బహిరంగంగా వెల్లడించవద్దని అధికారులకు సూచించినట్లు సమాచారం. పనితీరు మెరుగుపరుచుకోవడంపై అంతర్గతంగా దృష్టి సారించాలని, బహిరంగ విమర్శలకు ఆస్కారం ఇవ్వకూడదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

# పొలిటికల్ వార్ అంతా ఆన్‌లైన్లోనే

- జగనన్న టెక్ ఫోర్స్ రెడీ - డిజిటల్ వార్‌కు భారీ ఏర్పాట్లు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ రాజకీయాల్లో మళ్లీ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. కేవలం క్షేత్రస్థాయి పోరాటాలకే పరిమితం కాకుండా, ఆధునిక రాజకీయాల్లో నిర్ణయాత్మక శక్తిగా మారిన డిజిటల్ మీడియాపై వైసీపీ తన ఫోకస్ మళ్లించింది. టీడీపీకి చెందిన ఐటీడీపీ కి ధీటుగా, జగనన్న టెక్ ఫోర్స్ పేరుతో సరికొత్త డిజిటల్ సైన్యాన్ని రంగంలోకి దించేందుకు సిద్ధమైంది. మారుతున్న రాజకీయ సమీకరణాలు, ముఖ్యంగా తమిళనాడులో విజయ్ సాధించిన సోషల్ మీడియా విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని వైసీపీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తోంది.

### - హైదరాబాద్ వేదికగా వార్ రూమ్

2లో..

# మాడి పోవాల్సిందే

- ఎండల తీవ్రత మరింత ఎక్కువగా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరొకవైపు సెగ గాలులు, ఉక్కపోత కూడా ఎక్కువగా ఉంది. ఈ నెలలో ఎండల తీవ్రత మరింత ఎక్కువవుతుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కొంత ఉష్ణోగ్రతలు తగ్గుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ రానున్నకాలంలో మరింత పెరుగుతాయన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. మరొకవైపు వానలు కూడా అక్కడక్కడా పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే ఈసారి ముందస్తు వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. జూన్ మొదటి వారంలోనే వాతావరణం చల్లబడే అవకాశముందన్న అంచనాలు వినపడుతున్నాయి.

### - తెలంగాణలో మరింతగా...

తెలంగాణలో ఎండల తీవ్రత పెరగనుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలుల తీవ్రత కూడా అధికంగా ఉంది. అదే సమయంలో కొన్ని జిల్లాల్లో వానలు పడుతున్నాయి. అకాల వానలతో రైతులు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, కొమురంభీం జిల్లాల్లో

2లో..

# పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ భారీ ఊరట

- పాకిస్థాన్‌కు 1.3 బిలియన్ డాలర్ల నిధులు విడుదల




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పొరుగు దేశం పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి భారీ ఊరట లభించింది. కీలక కార్యక్రమాల సమీక్షలను పూర్తి చేసిన అనంతరం సుమారు 1.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 12,275 కోట్లు) నిధులను విడుదల చేసేందుకు ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదం తెలిపింది. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఈఎఫ్ఎఫ్) కింద మూడో సమీక్ష, రెసిలెన్స్ అండ్ సస్టెయినబిలిటీ ఫెసిలిటీ (ఆర్ఎస్ఎఫ్) కింద రెండో సమీక్షలను పూర్తి చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా తక్షణమే ఈఎఫ్ఎఫ్ కింద 1.1 బిలియన్ డాలర్లు, ఆర్ఎస్ఎఫ్ కింద 220 మిలియన్ డాలర్లు పాకిస్థాన్‌కు అందనున్నాయి. దీంతో ఈ రెండు కార్యక్రమాల కింద పాక్‌కు ఇప్పటివరకు అందిన మొత్తం నిధులు 4.8 బిలియన్ డాలర్లకు చేరాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ, పాకిస్థాన్ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేస్తోందని ఐఎంఎఫ్ ప్రశంసించింది. దీనివల్ల ఆర్థిక స్థిరత్వం కొనసాగుతోందని, బాహ్య ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయని పేర్కొంది. ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ నైజెల్ క్లార్క్ మాట్లాడుతూ.. "పాకిస్థాన్ ఆర్థిక పనితీరు బలంగా ఉంది. విదేశీ మారక నిల్వలు 2025 జూన్‌లో 14.5 బిలియన్ డాలర్లు ఉండగా, డిసెంబర్ నాటికి 16 బిలియన్ డాలర్లకు పెరిగాయి" అని తెలిపారు.

2లో..

# బేటీ బచావో' కేవలం నినాదానికే పరిమితమా.?

- మోదీకి కేటీఆర్ ప్రశ్న

2లో..



# దసరాలోపు ప్రారంభించకపోతే పాదయాత్రే

- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ నిర్వహించిన టీఆర్ఎస్
- రెండున్నరేళ్లలో ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా ఎత్తలేదన్న కవిత
- ప్రాజెక్టుపై రేవంత్ సర్కార్ కు కవిత అల్టిమేటం!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని టీఆర్ఎస్ అధినేత్రి కవిత విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ షాద్ నగర్ నియోజకవర్గంలోని చౌదరి గూడెం మండలం లక్ష్మీదేవిపల్లిలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సాధన

2లో..

# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

మార్చేందుకు తెలంగాణ సర్కారు చర్యలు చేపడుతోంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని సిగ్నల్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దుతామన్న సీఎం రేవంత్ రెడ్డి.. అండర్‌పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవల్ మోడల్ తీసుకురావాలని సూచించారు. రహదారుల విస్తరణతోనే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం కాదన్న ముఖ్యమంత్రి ఇందుకోసం మల్టీ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ అభివృద్ధిచేయాలన్నారు. అందులో భాగంగానే మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సచివాలయంలో వేదికగా పార్లమెంటరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ఆధునీకరణ, పట్టణీకరణ కారణంగా భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కొనాల్సి వస్తుందని అంచనా వేశారు. పెరుగుతున్న పట్టణ జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ మహానగరాన్ని ట్రాఫిక్ రహిత, పార్కింగ్ సమస్య రహిత, పొల్యూషన్ రహిత నగరంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్లుగా వర్గీకరించి, అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానించబోతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**- రాష్ట్ర అభివృద్ధి మూడు భాగాలుగా**

మెట్రో, ఎంఎంటీఎస్, బస్సు, సైక్లింగ్ ట్రాక్ లతో ఏకీకృత రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు రాష్ట్ర అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించారు. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల క్యూర్ ఏరియాను సర్వీస్ సెక్టార్ గా, ఓఆర్ఆర్ లోకల్ ప్యూర్ ఏరియాను తయారీ రంగంగా, మరింత బయట ఉన్న రేర్ ఏరియాను వ్యవసాయ రంగంగా అభివృద్ధి చేస్తారు.

**- క్యూర్, ప్యూర్, రేర్ అంటే..**

2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ –2047లో భాగంగా ఈ త్రిముఖ వ్యూహాన్ని ప్రతిపాదించింది. క్యూర్ కింద ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ప్రాంతాన్ని కాలుష్య రహితంగా మార్చి, ఐటీ, సర్వీస్ సెక్టార్ హబ్‌గా మార్చాలని ఉద్దేశం. ఇందులో భాగంగానే మూసీ రివర్ డెవలప్‌మెంట్, మెట్రో విస్తరణ, హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్యూర్ కింద ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఇండస్ట్రియల్ జోన్‌గా అభివృద్ధి చేస్తారు. ఇక రేర్ కింద రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతంలో వ్యవసాయ, ఆహార ప్రాసెసింగ్ రంగాలను ప్రోత్సహిస్తారు.

**- తెలంగాణా రైజింగ్ మాస్టర్ ప్లాన్ తో ముందుకు**

తెలంగాణ రైజింగ్ 2047 మాస్టర్ ప్లాన్ ద్వారా రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలు అమలు అయితే హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### స్వాతంత్ర్యనంతరం తొలిసారిగా

# కొలువుదీరిన కాషాయం

రామ్మోహన్ నాయుడులతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి రోజే ఈ కార్యక్రమం జరగడం బెంగాలీయుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

**- బలమైన కేబినెట్ కూర్పు..**

సువేందుతో పాటు పలువురు కీలక నేతలు మంత్రులుగా ప్రమాణం చేశారు. పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన దిలీప్ ఘోష్, మహిళా గళం అగ్నిమిత్రా పాల్, మతువా వర్గ ప్రతినిధి అశోక్ కీర్తనియా, గిరిజన నేత క్షుదిరామ్ టుడూ, యువ నేత నితీశ్ ప్రామాణిక్‌లు కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేస్తూ కూర్చిన ఈ టీమ్ బెంగాల్‌ను 'సోనార్ బంగ్లా'గా మార్చే దిశగా అడుగులు వేయనుంది. దశాబ్దాల కమ్యూనిస్ట్, టీఎంసీ పాలన తర్వాత వచ్చిన ఈ మార్పుపై బెంగాల్ ప్రజల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

**- నమ్మినబంటు నుంచి నంబర్ వన్ వరకు..**

55 ఏళ్ల వయసు కల్గిన సువేందు అధికారి 1970లో తూర్పు మేదినీపూర్‌లో జన్మించారు. మొదటి నుంచి రాజకీయాలపై ఆసక్తి ఉండగా ఆయన అంచలంచెలుగా ఎదుగారు. ఒకప్పుడు మమతా బెనర్జీకి అత్యంత ఆప్తుడిగా, టీఎంసీలో కీలక నేతగా ఉన్న సువేందు 2020లో ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. మమత మేనల్లుడి పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ బయటకు వచ్చిన ఆయన బెంగాల్‌లో బీజేపీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజాగా భవానీపూర్‌లో మమతా బెనర్జీని ఓడించి రికార్డు సృష్టించారు. అవివాహితుడైన సువేందు బెంగాల్‌కు 9వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

# బండికి 'సన్' స్ట్రోక్

రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు భగీరథ్ ఫిర్యాదులో పేర్కొన్నారని సమాచారం. భయంతో ఇప్పటికే రూ.50 వేల వరకు చెల్లించానని కూడా ఆయన వెల్లడించినట్లు తెలుస్తోంది.
– భగీరథ్ పైన హైదరాబాద్ లో యువతి కుటుంబం ఫిర్యాదు
మరోవైపు, సంబంధిత యువతి కుటుంబం కూడా భగీరథ్‌పై హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసింది. యువతి మైనర్ అని పేర్కొంటూ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం మరింత సంచలనంగా మారింది. ప్రస్తుతం రెండు వర్గాల ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిజానిజాలు వెలికితీసేందుకు కరీంనగర్, హైదరాబాద్ పోలీసు బృందాలు విచారణ ముమ్మరం చేసినట్లు సమాచారం.

**- బండి సంజయ్ కొడుకు బాధితుడా? లేక నిందితుడా?**

అయితే ఈ వ్యవహారంలో బండి సంజయ్ కుమారుడు బాధితుడు లేక నిందితుడా అన్నది పోలీసుల దర్యాప్తులో తెలియనుంది. ఇది పక్కాగా ప్లాన్ చేసిన హనీ ట్రాప్ అని భగీరథ్ వాదిస్తున్నాడు. మరోవైపు బాలిక కుటుంబం అందుకు భిన్నంగా మైనరు బాలిక పైన వేధింపులకు పాల్పడ్డాడని చెప్పడంతో ఏం జరుగుతుంది అన్నది ప్రస్తుతం తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది.

## తమిళనాడు రాజకీయాల్లో ముగిసిన సస్పెన్స్

ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతు తమకు ఉందని గవర్నర్‌కు వివరించారు. కాంగ్రెస్ (5), సీపీఐ (2), సీపీఎం (2), వీసీకే (2), ఐయూఎంఎల్ (2) పార్టీల మద్దతుతో కలిపి తమకు మొత్తం 120 మంది ఎమ్మెల్యేల బలం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించిన మద్దతు లేఖలను గవర్నర్‌కు సమర్పించారు. విజయ్ విజ్ఞప్తిని పరిశీలించిన గవర్నర్, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతిస్తూ లేఖ జారీ చేశారు. అయితే, మే 13వ తేదీలోగా శాసనసభలో తన బలాన్ని నిరూపించుకోవాలని విజయ్‌కు స్పష్టం చేశారు. గవర్నర్ నుంచి అనుమతి లభించడంతో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. నేడు ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు తమిళనాడు లోక్ భవన్ కార్యాలయం ప్రెస్ నోట్ విడుదల చేసింది.కాగా, నేడు విజయ్ తో పాటు మరో 9 మంది మంత్రులుగా ప్రమాణం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

## మాడి పోవాల్సిందే

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలు మినహా మిగతా జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. పగటి పూట ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదవుతుండటంతో పగటి వేళ వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగులు, చిన్నారులు బయటకు రావద్దని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

**- ఏపీలో వేడి, ఉక్కపోతతో జనం విలవిలా..**

ఆంధ్రప్రదేశ్ లో తీవ్రమైన వేడి, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు.ఇటీవల 45 డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. ఈ క్రమంలో తెలంగాణ వాతావరణ పరిస్థితులపై వాతావరణ శాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ద్రోణి/గాలి ప్రస్తుతం మధ్యప్రదేశ్ లోని నైరుతి ప్రాంతం నుండి విదర్భ, మరత్వాడ, అంతర్గత కర్నాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు సగటు సముద్రమట్టం నుండి 0.9 కి మీ ఎత్తులో కొనసాగుతోంది. శనివారం, ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.

# పొలిటికల్ వార్ అంతా ఆన్‌లైన్లోనే

వైసీపీ తన టెక్ ఫోర్స్ కార్యకలాపాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం వ్యూహాత్మక చర్యగా కనిపిస్తోంది. ఇక్కడి నుంచే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఒక భారీ డిజిటల్ వార్ రూమ్ ను నడపాలని పార్టీ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ నిఘా నీడ పడకుండా, స్వేచ్ఛగా పార్టీ తరపున నేరేటివ్ బిల్డ్ చేసేందుకు హైదరాబాద్ సేఫ్ జోన్ అని వైసీపీ భావిస్తోంది. ఇక్కడి నుంచే ప్రతి మండలానికి ఒక టెక్ వాలంటీర్‌ను సమన్వయం చేస్తూ, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం మరియు విపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం ఈ బృందం ప్రధాన విధి.

**- మండలానికి ఒక టెక్ వాలంటీర్ - మైక్రో లెవల్ మేనేజ్‌మెంట్**

గతంలో వైసీపీకి సోషల్ మీడియాలో బలమైన మద్దతు ఉన్నప్పటికీ, అది కొంత అస్తవ్యస్తంగా ఉండేది. కానీ ఇప్పుడు ప్రతి మండలానికి ఒక టెక్ వాలంటీర్‌ను నియమించడం ద్వారా వ్యవస్థను సంస్థాగతం చేస్తోంది. ఈ వాలంటీర్లు కేవలం పోస్టులు పెట్టడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని పసిగట్టి, దానికి అనుగుణంగా డిజిటల్ కంటెంట్‌ను రూపొందిస్తారు. ఇది పార్టీకి వ్యతిరేకంగా వచ్చే ప్రతి చిన్న వార్తను ప్రాథమిక దశలోనే తుడిచిపెట్టేందుకు ఉపయోగపడుతుంది.

**- నేరేటివ్ బిల్డింగ్ - మారుతున్న యుద్ధ క్షేత్రం**

ప్రస్తుత రాజకీయాల్లో ఓటరు నాడిని పట్టుకోవాలంటే వీధుల కంటే వాల్స్ మీద యుద్ధం చేయడం అత్యవసరమైంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పసిగట్టడం, సంక్షేమ పథకాలపై చర్చ పెట్టడం వంటి అంశాల్లో వైసీపీ ఈ టెక్ ఫోర్స్‌ను ఒక ఆయుధంగా వాడుకోనుంది. తాజా ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమి సోషల్ మీడియాను సమర్థవంతంగా వాడుకుని సక్సెస్ అయ్యింది. అదే తరహాలో పక్కా ప్లానింగ్‌తో వైసీపీ తన డిజిటల్ ఫుట్ ప్రింట్ 'ను పెంచుకోవాలని చూస్తోంది.

**- విజయ్ ఫార్ములా స్ఫూర్తితో..**

తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి సంప్రదాయ మీడియా మద్దతు పెద్దగా లేకపోయినప్పటికీ, కేవలం సోషల్ మీడియా నిఘా , డిజిటల్ క్యాంపెయినింగ్ ద్వారానే అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఈ డిజిటల్ వేవ్ ను చూసిన తర్వాతే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పార్టీ శైలిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో నాయకులు చేసే పనుల కంటే, అవి సోషల్ మీడియాలో ఎంత బలంగా ప్రాజెక్ట్ అవుతున్నాయనేదే ఎన్నికల ఫలితాలను శాసిస్తాయని వైసీపీ గట్టిగా నమ్ముతోంది.

**- ఐటీడీపీతో తలపడేందుకు సిద్ధం**

వైసీపీ టెక్ ఫోర్స్ నేరుగా టీడీపీ ఐటీ వింగ్‌తో తలపడనుంది. ఇప్పటివరకు సోషల్ మీడియాలో టీడీపీ ఒక అడుగు ముందుండగా, ఇప్పుడు వైసీపీ ప్రొఫెషనల్ టెక్ నిపుణులను రంగంలోకి దించడం ద్వారా ఆ గ్యాప్‌ను భర్తీ చేయాలని చూస్తోంది. వైసీపీకి ఉన్న లక్షలాది మంది కార్యకర్తలను ఒకే గొడుగు కిందకు తెచ్చి, ఏకకాలంలో ఒకే నేరేటివ్‌ను రాష్ట్రమంతా వ్యాప్తి చేయడం ఈ టెక్ ఫోర్స్ అసలు లక్ష్యం. రాజకీయాల్లో మనుగడ సాగించాలంటే డిజిటల్ స్పేస్ ను ఆక్రమించుకోవడం తప్పనిసరి అని వైసీపీ గుర్తించింది. జగనన్న టెక్ ఫోర్స్ కేవలం ఒక వాట్సాప్ గ్రూపుల నెట్‌వర్క్ మాత్రమే కాదు, అది ఒక పక్కా పొలిటికల్ మెషినరీలా పనిచేయనుంది. రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయ పోరాటం రోడ్ల కంటే మొబైల్ స్క్రీన్ల మీదే ఎక్కువగా కనిపిస్తుందనడంలో సందేహం లేదు. వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం ఆ పార్టీకి మళ్లీ పూర్వ వైభవాన్ని తెస్తుందో లేదో కాలమే నిర్ణయించాలి.

## పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ భారీ ఊరట

అయితే, అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు పెరగడంతో దేశీయంగా ఇంధన ధరలు పెరిగి ద్రవ్యోల్బణం ఒకింత పెరిగిందని, బాహ్యంగా సవాళ్లు ఉన్నాయని హెచ్చరించారు. ఆర్థిక క్రమశిక్షణ కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అవినీతి నిరోధక చర్యలు వంటి లోతైన నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాలని ఐఎంఎఫ్ నొక్కి చెప్పింది.

## దసరాలోపు ప్రారంభించకపోతే పాదయాత్రే

సభ పేరుతో టీఆర్ఎస్ పార్టీ సభ నిర్వహించింది. ఈ సభలో పాల్గొన్న కవిత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు అతీగతి లేకుండా పోయిందని ఆరోపించారు. జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో పాలమూరు, రంగారెడ్డి ప్రజలతో కలిసి తెలంగాణ రక్షణ సేన తెలంగాణ సాగునీటి సాధన కోసం పోరాటానికి శ్రీకారం చుట్టిందన్నారు కవిత. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నా ఆ నీళ్లను వాడుకునే అవకాశాన్ని పాలకులు లేకుండా చేశారని ఈ సందర్భంగా కవిత విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 33 వేల కోట్లు ఖర్చు చేసి 33 ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయకుండా పాలమూరు ప్రజలకు నష్టం కలిగిస్తోందన్న కవిత వారు చేసిన నష్టాన్ని తాము సరి చేస్తామని అన్నారు. దసరా పండుగ లోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను ప్రారంభించక పోతే ప్రాజెక్టు పరిధిలో పాదయాత్ర చేపడతామని కవిత ప్రకటించారు. ప్రాజెక్టు పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. నల్లమల పులి బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రెండున్నరేళ్లలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టెడు మట్టిని ఎత్తిపోయలేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహానికి వచ్చే ఎన్నికల్లో పాలమూరు ప్రజలు ఆ పార్టీని కిలో మీటర్ లోతున బొందపెట్టడం ఖాయమని కవిత హెచ్చరించారు. గత 12 ఏళ్ల కాలంలో కృష్ణా నది నుంచి పాలమూరు ఆయకట్టుకు చుక్క నీరైనా అందలేదన్న కవిత తెలంగాణలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. కొన్ని జిల్లాలలో ఒక్క ఎకరానికి కూడా కొత్తగా నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన ప్రతి ఒక్కరూ కూడా రాబోయే రోజుల్లో నీటి యుద్ధానికి సిద్ధంగా ఉండాలని కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

## బేటీ బచావో' కేవలం నినాదానికే పరిమితమా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'బేటీ బచావో' కేవలం నినాదానికే పరిమితమా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మైనర్ బాలికకు వేధింపుల ఆరోపణల నేపథ్యంలో, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని ప్రధానిని ప్రశ్నించారు. కేంద్రమంత్రి తనయుడు కాబట్టి ఆయనకు మినహాయింపు ఉంటుందా అని నిలదీశారు. కుమారుడిపై వచ్చిన ఆరోపణలకు గాను, బండి సంజయ్‌ను మంత్రి వర్గం నుంచి ఎప్పుడు బర్తరఫ్ చేస్తారని ప్రశ్నించారు. ఇదే అంశంపై ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా విమర్శలు గుప్పించారు. తెలంగాణలో మీ పార్టీ 'జంగిల్ రాజ్' ఎలా నడుపుతుందో చూడాలని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. ఒక మైనర్ బాలిక పూర్తి ఆధారాలతో వస్తే, పోలీసు శాఖ వేగంగా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇతర పోక్సో నేరస్తుల మాదిరిగానే బండి సంజయ్ కుమారుడిపై ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంలో తిరిగి మైనర్ బాలికపై కేసు పెట్టడమేమిటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలబడతారా అని ప్రశ్నించారు. బీజేపీకి తెలంగాణ కాంగ్రెస్ ఒక ఫ్రాంచైజీలా పనిచేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. మైనర్ బాలిక విషయంలో కాంగ్రెస్, బీజేపీలు ఒక అపవిత్రమైన, అసహ్యకరమైన ఒప్పందానికి వచ్చాయా అని ధ్వజమెత్తారు. పదిహేడేళ్ల బాధితురాలు, ఆమె కుటుంబం ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడానికి మూడు నెలలకు పైగా ఎందుకు పోరాడాల్సి వస్తోందని ప్రశ్నించారు. మైనర్ బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసిందని అన్నారు. న్యాయం కోసం మూడు నెలలుగా తిరుగుతున్నప్పటికీ వారిని పట్టించుకోలేదని విమర్శించారు. ఆడబిడ్డల రక్షణ కోసం ప్రభుత్వంతో కూడా ఎంతవరకైనా పోరాడుతామని హెచ్చరించారు.

# వివాహిత ఆదృశ్యం

**ఉప్పల్** కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యం అయింది. ఉప్పల్ పిఎస్ పరిధి ఆదర్శ్ నగర్ కాలనీకి చెందిన సారంగా జమున (36) అనే గృహిణి కనిపించకుండా పోయింది. ఈనెల 3న భర్త, పిల్లలతో జరిగిన కుటుంబ కలహాల అనంతరం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త రాముడు ఉప్పల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు వెంటనే ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.



## ఘనంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపుర్ గ్రామంలో బాల్ రాజు గౌడ్ స్వామి కుటుంబ సభ్యులతో స్వగృహంలో భక్తిశ్రద్ధలతో అహ్మదిపుర్ హనుమాన్ స్వామిలు మరియు స్థానిక భక్తులు గురుస్వామి భూపాల్ స్వామి ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం దిగ్విజయంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి కి కుటుంబ సభ్యులతో భక్తులు పంచామృతాలతో అభిషేకించి ఆకు పూజ, అష్టోత్తర శతనామావళి వంటి కార్యక్రమాలను కన్నుల పండుగ నిర్వహించారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా భక్త భజనలతో నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అల్పాహారం పాలు పళ్ళు వితరణ చేశారు ఈ సందర్భంగా భూపాల్ స్వామి మాట్లాడుతూ హనుమాన్ స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలని కోరుకుంటూ, హనుమాన్ మాలధారణ శ్రేష్టమని, యువత దైవభక్తి సేవా భావం కలిగి ఉండాలని దైవనామస్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని హనుమాన్ మాలధారణ వల్ల, కోరిన కోరికలు నెరవేరుతాయి అని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో కుటుంబ సభ్యులు ఎల్లగౌడ్ బాలమణీ , బాల్ రాజు గౌడ్, రేణుకా, నరేశ్ గౌడ్, మానస, కృష్ణ గౌడ్ , హనుమాన్ స్వామిలు కొండల్ రెడ్డి , ప్రభాకర్, మహేష్, నాగరాజు గౌడ్ ,పోశయ్య రాములు, స్వామి, శ్రీనివాసరెడ్డి, సాయి రెడ్డి, మల్లేష్ గౌడ్, రవీందర్, భరత్ గౌడ్, సంపత్, రమేష్, నాగేష్, నరేందర్, అరుణ్, బాలస్వామి సుమన్ సందీప్ అజయ్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు

## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

### - కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహణ



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దాతర్ పల్లిగ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, కళ్యాణ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దమనిషి తలారి సత్యనారాయణ, ఆలయ చైర్మన్ తలారి స్వామి, ముదిరాజ్ కుల సంఘం సభ్యులు తలారి యాదగిరి, తలారి సత్యనారాయణ, బండ్ల రాజు పాల్గొన్నారు. అలాగే కాకి పడగల వారు వెంకటేశం, కిషోర్, నారాయణ, రాజారాం, అరవింద్, రఘునాథ్, సంజీవులు తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## వర్తక సంఘం రద్దు చేయడం అంటే ఒకరి పొట్ట కొట్టడమే

**ఉన్న దుకాణాలను కొనసాగిస్తూనే, నిరుద్యోగులకు**

**మరిన్ని దుకాణాలు వచ్చేలా కృషి చేద్దాం**

**బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య,**

**పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి**



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయడం అంటే ఉపాధి పొందుతున్న పేదల మధ్య తరగతి వారి పొట్ట కొట్టడమేనని అలా కాకుండా ఉన్న దుకాణాలను కొనసాగిస్తూనే స్థానిక నిరుద్యోగ యువతకు అదనంగా దుకాణాలు వచ్చేలా దేవస్థానం వారితో ప్రభుత్వంతో పోరాడుదాం అని బి ఆర్ ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రి వెంకటయ్య పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరీలు అన్నారు. శనివారం వారు యాదగిరిగుట్ట బిఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని కొంతమంది నిరుద్యోగులు పోరాటం చేస్తున్నారని వర్తక సంఘాన్ని రద్దు చేయాలి అని కాకుండా ఉన్న దుకాణాలను కొనసాగిస్తూనే తమకు కూడా దుకాణాలను కేటాయించాలని వారు కోరాలని అన్నారు

అలా అయితే తమ మద్దతు కూడా ఉంటుందని అన్నారు 114 దుకాణాలకు గాను ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 500 మంది ఉపాధి పొందుతున్నారని ఉన్నపలంగా వర్తక సంఘాన్ని రద్దుచేసి దుకాణాలను రద్దు చేయడం అంటే వారందరినీ రోడ్డున పడేయడమేనని అన్నారు ఇది సరైన కాదని అన్నారు. నిరుద్యోగులకు యాదగిరిగుట్ట దేవస్థానంలో ఉద్యోగ దుకాణాల ద్వారా వారికి ఉపాధి కల్పించేందుకు అందరం కృషి చేద్దామని అన్నారు.
ఇప్పటికైనా దుకాణాలను వర్తక సంఘాన్ని రద్దు చేయాలని వారి ఆందోళనను విరమించుకోవాలని కోరుతున్నామని అన్నారు ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు ఆరే శ్రీధర్ గౌడ్ , కాంటే కార్ పవన్ కుమార్, ముక్కెర్ల సతీష్ యాదవ్, అంకం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన

## రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ

- రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు
- రైతులు ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట కల్లాల్లోనే ధాన్యం ఆరబోసుకోవాలి.
- డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్ నగర్** జిల్లాలో కొంతమంది రైతులు, వ్యాపారులు రహదారులపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిర్దిష్ట కల్లాల్లో లేదా వ్యవసాయ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే ఆరబోసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డిఎస్పీ కోరారు.

### బంగారు గొలుసు చోరీ కేసులో

# ముద్దాయి అరెస్ట్



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామంలో ఏప్రిల్ 29 వ తేదీన రామలక్ష్మమ్మ అనే వృద్ధురాలు మెడ లోని 6 లక్షల విలువ చేసే 4.2 తులాల బంగారు గొలుసును చోరీ చేసిన దొంగను వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. డి.ఎస్.పి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన జగన్మోహన్ రెడ్డి అనే వ్యక్తి భూసార పరీక్షలు చేయడానికి వచ్చినట్టు ఆమెను ఆమెను బెదిరించి మెడలోని గొలుసును చేరు చేశాడన్నాడు. రూరల్ సీఐ రమణ, దొర్నిపాడు ఎస్సై ఎస్సై శ్రీకాంత్ ఈ కేసులో కృషిచేసి పది రోజుల వ్యవధిలోని నిందితుడిని పట్టుకోవడం జరిగిందని అభినందించారు. నిందితుని రిమాండ్ కు పంపుతున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

### శిథిలావ్యవస్థ కు చేరుకున్న

# పలు కాలనీల రోడ్లు

- స్పందించని కూటమి ప్రభుత్వం
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి - సిపిఐ




**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణంలో పలు ప్రధాన కాలనీలలో సిసి రోడ్లు శిథిల వ్యవస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో నూతన సీసీ రోడ్లు వేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) పట్టణ కార్యదర్శి జి రంగన్న, సిపిఐ నాయకులు భాస్కర్ యాదవ్ తెలిపారు. అనంతవరం శనివారం పట్టణ నడిబొడ్డున ఉన్న లక్ష్మీ పేట, వేణు విద్యాలయం స్కూల్,లైన్ లో పాడైపోయిన సిసి రోడ్డు స్థానంలో నూతన సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ కాలనీ మహిళలతో నిరసన వ్యక్తం చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 34 వ వార్డులో వేణు విద్యాలయం స్కూల్ లైన్ లో రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉందని, ఈ రహదారి నడవడానికి వీలు లేకుండా గుంతలతో ప్రమాదకరంగా మారిందని ఈ రోడ్డులో నిత్యం వెళ్లాలంటే విద్యార్థులకు,వృద్దులకు ,కాలనీ ప్రజలకు నరకం కనిపిస్తుందని,గర్భిణీలు స్త్రీలు చికిత్సకు హాస్పటల్ కి వెళ్లాలంటే ఈ రోడ్డు కు ఆటో కుడా రానటువంటి పరిస్థితి ఉందని,ఇంత అధ్వానంగా ఉన్న రోడ్డు మరొకటి లేదని వారు తెలిపారు. మున్సిపల్ అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి,వినతి, పత్రాలు ఇచ్చిన స్పందించకపోవడం బాధాకరమని పన్నుల విషయంలో మాత్రం ముక్కుపిండి బలవంతంగా పన్ను వసూలు చేస్తున్నారే తప్ప ఈ కాలనీ ప్రజలకు నడవడానికి కనీసం రోడ్డు కూడా వేయలేదని, మున్సిపల్ అధికారులు తక్షణమే నూతన సిసి రోడ్డు వేసి నరకం నుండి విముక్తి కలిగించాలని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వ నాయకులు అసెంబ్లీ ఎన్నికల లో అధికారంలో వస్తే రెండు నెలలు లో రోడ్డు వేస్తామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చి ఓట్లు వేయించుకోవడం జరిగిందని, కానీ గెలిచిన తర్వాత కనీసం ఆ కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదని కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున కూటమి ప్రభుత్వ నాయకులపై విమర్శలు చేయడం జరుగుతుందని, కాబట్టి స్థానిక ఎన్నికల లోపు ఈ కాలనీకి నూతన సిసి రోడ్డు వెయ్యకపోతే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని కాలనీ ప్రజలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మల్లికార్జున గౌడ్ వీరేష్,నరసింహులు,జాఫర్ పటేల్, మరియు కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

### మురికి కాలువ నిర్మాణ పనులు

## పరిశీలించిన కమిషనర్ నరసింహారెడ్డి



**బద్వేలు** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో పద్మావతమ్మ హాస్పిటల్ నుండి పూలే విగ్రహం వరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న ప్రధాన డ్రైన్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ పనుల పురోగతిని సమీక్షించి, నిర్ణీత గడువులోపు నాణ్యతతో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ శివారెడ్డి కి సూచించారు.రాబోయే వర్షాలను దృష్టిలో పెట్టుకొని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రత్యేకంగా ఆదేశించారు.అలాగే పనులు సజావుగా కొనసాగేందుకు ప్రజలు కాంట్రాక్టర్ కు సహకరించాలని, అలాగే కాంట్రాక్టర్ కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కమిషనర్ సూచించారు.ఇరువురు పరస్పర సహకారంతో పనులను సమయానికి పూర్తి చేయాలని పేర్కొన్నారు.నిర్మాణ సమయంలో ప్రజలకు లేదా కాంట్రాక్టర్ కు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## చాగలమర్రిలో వైభవంగా జాంబవంతుని ఆలయం జీర్ణోద్ధరణ కార్యక్రమం




**చాగలమర్రి** నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల అతి పురాతనమైన దేవాలయం శ్రీ జాంబవంతుని దేవాలయం.ఈ దేవాలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యములో దేవాలయ జీర్ణోద్ధరణ చేశారు.పూజారులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యములో గణపతిపూజ , పుణ్యాహవాచనము , ఋత్వికరణం , పంచగవ్యప్రాసన , కలశారాధన , స్వామి వారి పంచామృత అభిషేకాలు , గణపతి ప్రతిష్ట , శ్రీ కృష్ణుని ప్రతిష్ట , సూర్యదేవుని ప్రతిష్ఠ , ప్రధాన ఆలయ శిఖర ప్రతిష్ఠ , హోమాలు జరిపించారు. పూజారి లక్ష్మీకాంత్ శర్మ మాట్లాడుతూ ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు వివరించారు.ఈ కార్యక్రమంలో పూజారులు లక్ష్మీ కాంత్ శర్మ , పవన్ కుమార్ , సోమనాథ్ శర్మ , చరణ్ కుమార్ ఆధ్వర్యములో జాంబవంతునికి విశేష పూజలు జరిపించి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు నిర్వహించారు.పూజ అనంతరం తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డు వేణుగోపాల్ రెడ్డి , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అధ్వానంగా మారిన రహదారికి

# మరమ్మతులు చేపట్టాలి



**అరకులోయ** 30 ఏళ్లుగా నిర్మించిన తారు రోడ్డు ధ్వంసమై నీటి కుంటల తలపిస్తున్నాయి గుంతలమయమైన రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చెపట్టాలని గిరిజనులుడిమాండ్ చేశారు అరకులోయ మండలం సుంకరమెట్ట జంక్షన్ నుండి పెద్దపాడు జంక్షన్ వరకు ఉన్న తారు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం గిరిజనులు పత్రిక విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి పలు పనుల నిమిత్తం ప్రయాణికులు రైతులు కళాశాల పాఠశాల విద్యార్థులు తదితరులు రాకపోకలు సాగిస్తారని తెలిపారు సుంకరమెట్ట జంక్షన్ నుండి మాడగడ కొత్తవలస పెదపాడు జంక్షన్ వరకు కంకర తేలిన రోడ్డు గుంతల మయంగా మారిందని దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం. అధికారులు రోడ్డు మరమ్మతులు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు

### గర్భిణీలకు పోషకాహారం అందించిన

## గోగులపాటి రాజు ఆదర్శనీయులు

- తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పరుచూరి



**అమరావతి,** సృష్టిని సృష్టించనున్న గర్భిణీలకు పోషకాహారం అందించిన గోగులపాటి రాజు ఆదర్శనీయులని బలమైన పోషకాహారాన్ని రెండు సంవత్సరాలుగా పంపిణీ చేస్తున్న జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ సేవలు మరువలేమని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ,బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోగులపాటి రమాదేవి,రాజు దంపతుల సహకారంతో శనివారం గర్భిణీలకు వారి సహాయకులకు భోజనంతోపాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈసందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న సంకల్పంతో గర్భిణీలకు రెండు సంవత్సరాల నుండి పోషకాహారాన్ని అందిస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందించటానికి మంచి మనసుతో ముందుకు వచ్చిన గోగులపాటి రాజు కుటుంబ సభ్యులు ఆదర్శనీయులని అన్నారు.రాజు మాట్లాడుతూ సామాజిక సేవలో జనచైతన్య సమితి దశాబ్దాల కాలంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు.ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దాసరి విజయ్ బెన్నిబాబు, కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్,వాకా ప్రవీణ్ కుమార్,అందే నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. భోజనంతోపాటు కోడిగుడ్లు,యాపిల్ కాయలు, దానిమ్మకాయలు, అరటి పండ్లు,డ్రైఫ్రూట్ లడ్లు, కొబ్బరితో తయారుచేసిన ఉండలు,ఖర్జూర పళ్ళు వేరుశనగ విత్తనాలతో తయారుచేసిన వేరుశనగ ఉండలను పంపిణీ చేశారు.

# కడపలో తీవ్ర ఉద్రిక్తత

**కడప** కడపలోని ఆల్మస్ పేట సర్కిల్ లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇరు వర్గాలు రాళ్ళ దాడులు చేసుకున్నాయి. ఈ సర్కిల్ కు టిప్పు సుల్తాన్ సర్కిల్ గా పేరు పెట్టటం పై వివాదం ప్రారంభమయింది.

సర్కిల్ కు హనుమాన్ సర్కిల్ అని పేరు పెట్టాలని మరో వర్గం డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు భారీగా మొహరించి రాళ్ళ దాడులకు దిగారు. ఘటనలో ఒక సిఐ, ఎస్సై, కానిస్టేబుల్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి. పరిస్థితి అదుపులోకి తేవటానికి పోలీసులు లాటీచార్జ్ చేసారు. ఇరు వర్గాలతో పోలీసులు చర్చలు జరుపుతున్నారు.

### కరివేన గ్రామంలో

# శక్తి యాప్ అవేర్నెస్ ప్రోగ్రాం



**నంద్యాల** ఆత్మకూరు ంఖూ మనోహర్ తో కరివేన పంచాయతీ సెక్రెటరీ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ నాయక్, శక్తీ టీమ్ సిబ్బందిహెడ్ కానిస్టేబుల్ నూర్ అహమ్మద్, డబ్ల్యూ. హెచ్. జి సుప్రియ .ఆధ్వర్యంలో ఆత్మకూరు జఖూ పరిధిలోని కరివేన గ్రామం లో ఔఖీఉూ ఉపాధి హామీ పథకం లో భాగంగా జరుగుచున్న కరువు పనికి వచ్చిన మహిళలకు మరియు మగ వారికి " శక్తీ యాప్ " అవేర్నెస్ ప్రోగ్రాము లో భాగంగా మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,జీజూఎ ఫైల్స్ లాంటివి ఏదన్నా వాట్స్ అప్ లో పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ, వాటి ద్వారా వారికీ జేరిగే ఆర్థిక నష్టాల గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. అలాగే అవేర్నెస్ ప్రోగ్రాములో పాల్గొన్న అందరు వారి మొబైల్స్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని, ఆపద సమయం లో ఎలా ఉపయోగించుకోవాలో తెలుపుతూ అవేర్నెస్ కలిపిస్తూ ప్రోగ్రాము చేయడం జరిగినది. అదేవిధంగా మీ, మీ ఇంట్లోని మగవారు వారి మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేసే లాగా చెప్పమని చెప్తూ ఏదైనా అనుకోకుండా యాక్సిడెంట్లు జరిగితే తలకు దెబ్బలు తగలడం వల్లనే నూటికి 90 శాతం మంది చనిపోవడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు కచ్చితంగా తలకు హెల్మెట్ ధరించమని తెలిపారు. అదేవిధంగా అక్కడికి వచ్చిన మగవారికి ఎవరు కూడా మధ్యం తాగి వాహనాలు నడపవద్దని తెలుపుతూ అట్లా తాగి వాహనాలు నడిపితే 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను కోర్టు వారు విధిస్తారు అని తెలుపుతూ అవేర్నెస్ కలిగించడం జరిగింది

## రేణిగుంట ఎయిర్‌పోర్టులో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా జ్ఞానేష్ కుమార్ దంపతులకు ఘన స్వాగతం...





**రేణిగుంట** భారత ప్రభుత్వ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులు తిరుమల శ్రీవారి దర్శనార్థం రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో వారికి ఘన స్వాగతం లభించింది.?విమానాశ్రయానికి చేరుకున్న సి.ఇ.సి జ్ఞానేష్ కుమార్ దంపతులకు ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఐఏఎస్ పుష్పగుచ్ఛాలు అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డిలు కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. వీరితో పాటు జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.?కేంద్ర ఎన్నికల కమిషనర్ పర్యటనను పురస్కరించుకుని రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుమల వరకు పోలీస్ యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎయిర్‌పోర్ట్ వద్ద బందోబస్తుతో పాటు, కాన్వాయ్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలను పోలీస్ అధికారులు స్వయంగా పర్యవేక్షించారు. అధికారుల స్వాగతం అనంతరం, జ్ఞానేష్ కుమార్ దంపతులు కారులో తిరుమలకు బయలుదేరి వెళ్లారు

# టిటిడి ఏఈ పోస్టులు స్థానికులకే దక్కాలి

- తిరుపతి స్థానిక హక్కుల పోరాట సమితి నాయకుడు డీఎంసీ భాస్కర్ డిమాండ్...?

**తిరుపతి** తిరుమల తిరుపతి దేవస్థానంలో (టిటిడి) భర్తీ చేయనున్న 74 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టులపై తిరుపతి స్థానిక హక్కుల పోరాట సమితి సమరశంఖం పూరించింది. ఈ సందర్భంగా సమితి నాయకుడు డీఎంసీ భాస్కర్ మాట్లాడుతూ.. మే 10, 11 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టిటిడిలోని నాన్ లోకల్ అధికారుల తీరును తప్పుబడుతూ, "పరాయి పాలకులారా.. మా స్థానిక నిరుద్యోగుల హక్కులను కాలరాయకండి" అంటూ తీవ్రంగా హెచ్చరించారు.?తిరుపతి ప్రాంతంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో పోటీ పడగల అద్భుతమైన ఇంజనీరింగ్ ప్రతిభావంతులు ఉన్నారని, వారికి ఎవరూ సాటి రారని ఆయన స్పష్టం చేశారు. అటువంటి మేధావులు ఉన్న తిరుపతిలో, స్థానిక ఉద్యోగాలను రాష్ట్రవ్యాప్తం చేయడం సరికాదని మండిపడ్డారు. తిరుమల, తిరుపతి, మరియు తిరుపతి రూరల్ వాసులకే ఈ 74 ఏఈ పోస్టులు దక్కాలని, రాష్ట్రవ్యాప్త నియామక ప్రక్రియకు స్వస్తి పలకాలని ఆయన కోరారు. స్థానికులను ఎంతగా అణిచివేయాలని చూస్తే ఉద్యమం అంతగా బలపడుతుందని, ఇప్పటికైనా అధికారులు పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని డీఎంసీ భాస్కర్ హెచ్చరించారు.

# సహకార శాఖలో పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు

- ఉద్యోగులకు సమయానికి పదోన్నతులు
- వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వ్యవసాయ,సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి:** సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా, ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు విజయవాడలో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు పదోన్నతులు త్వరితగతిన మంజూరు చేయడమే కాకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసినందుకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ప్రమోషన్లు పొందిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి ఉద్యోగులతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అలాగే సహకార శాఖలో వివిధ కేడర్ల ఉద్యోగులకు జారీ చేసిన ప్రమోషన్లలో 100 శాతం పారదర్శకత పాటించామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో సహకార శాఖలో వివిధ కేడర్లలో దాదాపు 350కు పైగా ప్రమోషన్లు కల్పించబడినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ప్రమోషన్ ప్రక్రియ అమలు చేయడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతమైందన్నారు. అలాగే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన ఆదేశాలతో ప్రమోషన్లు, పోస్టింగులు అత్యంత పారదర్శకంగా అమలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జీసీబీవీ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి. విజయ్ కుమార్, పి. రాజశేఖర్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి. సందీప్, సహ అధ్యక్షుడు యు. రమేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు వై. యేసు కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్. భావనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మే 11న సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్



సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ సందర్భంగా మే 11వ తేదీన దేవస్థానంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలియజేశారు. సోమనాథ ఆలయంపై దాడి జరిగి 1000 సంవత్సరాలు మరియు దాని పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా భారతప్రభుత్వ సాంస్కృతికశాఖ దేశవ్యాప్తంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరున పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర దేవదాయశాఖ ఉత్తర్వుల మేరకు మే 11వ తేదీన శ్రీశైలదేవస్థానంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లుగా వారు తెలియజేశారు. ఇందులో భాగంగానే మే 11 వ తేదీన ఉదయం గం. 7.00ల నుంచి గంగాధరమండపం వద్ద కలశయాత్ర ఉంటుందన్నారు. గంగాధరమండపం ప్రారంభమయ్యే ఈ కలశయాత్ర నందిమండపం వరకు, అక్కడి నుంచి మల్లికార్జునసదన్ మీదుగా బయలువీరభద్రస్వామి ఆలయం వరకు మరియు అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు ఈ కలశయాత్ర నిర్వహించబడుతుందన్నారు. అనంతరం పంచాక్షరీ మంత్రలేఖనానికి భక్తులకు పుస్తకాలను అందజేయడం జరుగుతుందన్నారు. తరువాత గంగాధర మండపం వద్ద గల ఏర్పాటు చేయనున్న వేదికపై గం. 10.00లకు ఎల్.ఈ.డి స్క్రీన్ నందు జాతీయ కార్యక్రమ ప్రదర్శన ఉంటుందన్నారు. కాగా సాయంకాలం గంగాధర మండపం వద్ద ఏర్పాటు చేయనున్న వేదిక వద్దనే గం.5.30ల నుంచి శివభజనలు, భక్తిరంజని కార్యక్రమాలు ఉంటాయన్నారు. తరువాత సాయంత్రం గం. 6.30లకు ఓంకారం ప్రాశస్త్యంపై ధార్మిక ప్రవచనం అనంతరం ఓంకార మంత్రజపం ఉంటుందన్నారు. కార్యక్రమం అనంతరం రాత్రి గం. 7.30ల నుంచి పేరిణి శివతాండవం ప్రదర్శన ఉంటుందన్నారు. కావున భక్తులందరు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారివారు తెలియజేశారు.

## తెలుగుదేశం పార్టీ సుపరిపాలనలో
## సాగునీటి వనరుల అభివృద్ధికి మహర్దశ



**మైదుకూరు** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో మైదుకూరు నియోజకవర్గంలోనీ తెలుగుగంగ, కేసీ కాలువతో పాటు చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో ఆయకట్టుకు అనుగుణంగా నిధుల కేటాయింపునకు ప్రభుత్వం అనుమతి తెలిపింది.ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలుగుగంగ, కేసీ కాలువ, చిన్ననీటిపారుదల శాఖ అధికారులతో చర్చించి ఆయకట్టు పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.తెలుగుగంగ పరిధిలో 11 పనులకు రూ.136.25 లక్షలు, కేసీ కాలువ పరిధిలో 15 పనులకు రూ.89.95 లక్షలు, చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో మైదుకూరు ఎర్రచెరువుతో పాటు బ్రహ్మంగారి మఠం మండలంలోని మరో 8 చెరువుల పునరుద్ధరణ పనులకు రూ.73.80 లక్షలు ఖర్చు చేయనున్నారు.కేసీ కాలువ ఆయకట్టుకు మంజూరైన నిధులకు సంబంధించి రూ.10 లక్షలలోపు పనులను సాగునీటి వినియోగదారుల సంఘాలతో, రూ.10 లక్షలు పైబడితే టెండర్ ప్రక్రియ ద్వారా చేపట్టనున్నట్లు డీఈఈ పుల్లయ్య తెలిపారు.

## గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ



**బ్రహ్మం గారి మఠం** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం మఠాధిపతులు శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆదేశానుసారం మఠం మేనేజర్ ఈశ్వర చారి గారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు గర్భిణీ లకు పౌష్టికాహారం పులిహోర పెరుగన్నం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుల తో పాటు, నర్సులు, బ్రహ్మంగారిమఠం దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ మహిళ ఘటన విషాదాంతం



**నందిగామ** ఎన్టీఆర్ జిల్లా నందిగామలో గత నెల 22వ తేదీన పుట్టింటికి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన విషాదాంతమైంది. ఈ కేసులో కాలువలో మహిళ మృతదేహం లభ్యమవడంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. నాగలక్ష్మి అనే మహిళ తన భర్త నరసింహారావుతో కలిసి నివసిస్తోంది. ఆమెకు ఇది రెండో వివాహం అని తెలిసింది. ఈ నెల 22న పుట్టింటికి వెళ్లిన నాగలక్ష్మి తిరిగి రాకపోవడంతో భర్త నరసింహారావు 24వ తేదీన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో శ్రీశైలం సమీపంలోని ఈగలపెంట పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. అనంతరం ఆ మృతదేహం నాగలక్ష్మిదేనని పోలీసులు గుర్తించారు.కేసు విచారణలో నాగలక్ష్మికి రెండో పెళ్లికి ముందు ఆమె బావ గోవిందయ్యతో పరిచయం ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అత్తగారి ఇంటి నుంచి పుట్టింటికి వెళ్లిన సమయంలో నాగలక్ష్మి, గోవిందయ్య మధ్య మాట్లాడుకునే సందర్భంలో గొడవ జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ గొడవలో గోవిందయ్య నాగలక్ష్మి తలపై దాడి చేసి అనంతరం కాలువలో పడేసినట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి గోవిందయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారురాలి ఇంటికే
## అందజేసిన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



**బద్వేలు** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదవాడి పెన్నిధి అని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శనివారం కాశినాయన మండలం ఉప్పులూరు గ్రామంలో అనారోగ్యంతో చికిత్స పొంది మృతి చెందిన లక్ష్మీ ప్రసన్న కుమారుడు కి మంజూరైన రూ.66,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును నేరుగా ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ.. గతంలో చెక్కుల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి భిన్నంగా నేడు పారదర్శక పాలనతో లబ్ధిదారుల ఇంటికే సాయం చేరుతోందన్నారు. ఆరోగ్యశ్రీలో కవర్ కాని కేసులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా తక్షణ సాయం అందిస్తున్నామని, ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ గురువి రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోలిరెడ్డి, టీడీపీ నేతలు విజయ్ కుమార్ రెడ్డి, దుగ్గిరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ఆగస్టు నెల
## దర్శన కోటా విడుదల వివరాలు

**కడప** ఆగస్టు నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలను టీటీడీ ప్రజా సంబంధాల ముఖ్య అధికారి విడుదల చేసిన వాటిలో ఈ విధంగా ఉన్నాయి.తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల( సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను మే 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.ఈ టికెట్లు పొందిన వారు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి.21న ఆర్జిత సేవా టికెట్ల విడుదలకల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. అదే విధంగా వార్షిక పవిత్రోత్సవాల (23-08-26 నుండి 25-08-26) టికెట్లను కూడా మే 21 ఉదయం 10గం. ఆన్లైన్ లో విడుదల చేయనున్నారు.వర్చువల్ సేవల కోటా విడుదలవర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.23న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదలఅంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.శ్రీవాణి దర్శన కోటా విడుదలశ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా?వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదలప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదలతిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

## కడపలో టిప్పు సుల్తాన్ విగ్రహ వివాదం

**కడప,** కడప నగరంలోని ఆల్మాస్ పేట సర్కిల్ పేరు మార్పు వ్యవహారం శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సర్కిల్‌ను టిప్పు సుల్తాన్ సర్కిల్ గా మార్చాలని ఒక వర్గం ప్రయత్నించగా, దానిని మరో వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ వివాదంతో ఆల్మాస్ పేట ప్రాంతం ఒక్కసారిగా రణరంగంగా మారింది.

ఇరువర్గాల మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని పోటాపోటీగా ఆందోళనలు చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఈ వివాదానికి ప్రధాన కారణం సర్కిల్ నామకరణం. ఆల్మాస్ పేట సర్కిల్‌కు టిప్పు సుల్తాన్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్న వారు, దానిని హనుమాన్ సర్కిల్ గా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, టిప్పు సుల్తాన్ పేరునే కొనసాగించాలని మరికొందరు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాటలు జరగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకుంటూ ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత దాడుల స్థాయికి చేరింది. సమాచారం అందిన వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను ఆల్మాస్ పేట సర్కిల్ వద్ద మోహరించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు.

నిరసనకారులను అదుపులోకి తీసుకుని శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, ముందస్తు జాగ్రత్తగా పోలీసులు పికెటింగ్‌ను కొనసాగిస్తున్నారు.ఈ వివాదంపై రాజకీయ ప్రకంపనలు కూడా మొదలయ్యాయి. భారతీయ జనతా పార్టీ (ఃఏఖ) , ఇతర హిందూ సంఘాలు టిప్పు సుల్తాన్ పేరు పెట్టడాన్ని మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. టిప్పు సుల్తాన్ హిందూ వ్యతిరేక పాలకుడని, అటువంటి వ్యక్తి పేరును ప్రజా ప్రదేశాలకు పెట్టడం సరికాదని వారు వాదిస్తున్నారు. మరోవైపు, టిప్పు సుల్తాన్ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన దేశభక్తుడని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. ఈ మతపరమైన, రాజకీయ వివాదం కడప నగరంలో చర్చనీయాంశంగా మారింది ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కొందరు కావాలని ఇటువంటి వివాదాలను తెరపైకి తెస్తున్నారని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

శాంతియుత వాతావరణం నెలకొనేలా ఇరువర్గాల పెద్దలతో చర్చలు జరిపి, త్వరలోనే ఒక పరిష్కారానికి రావాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు ఎటువంటి రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని, శాంతిని కాపాడాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## భారత త్రివిధ దళాల నూతన అధిపతిగా
## లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి

**న్యూఢిల్లీ** దేశ రక్షణ రంగంలో అత్యున్నత పదవి అయిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గా లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) ఎన్.ఎస్. రాజా సుబ్రమణి నియమితులయ్యారు. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఈ నెల 30న పదవీ విరమణ చేయనుండటంతో, ఆయన స్థానంలో సుబ్రమణి బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్ నేతృత్వంలోని నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ లో సైనిక సలహాదారుగా పనిచేస్తున్న ఆయన, ఈ నియామకంతో పాటు మిలిటరీ అఫైర్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా కూడా వ్యవహరిస్తారు. వరుసగా మూడవసారి కూడా సీడీఎస్ పదవి ఆర్మీ విభాగానికే దక్కింది.దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సైనిక అనుభవం కలిగిన రాజా సుబ్రమణి, భారత సైన్యంలో అనేక కీలక బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించారు. 1985లో గర్వాల్ రైఫిల్స్‌లో కమిషన్ పొందిన ఆయన, అస్సాంలో ఉగ్రవాద వ్యతిరేక పోరాటాల్లో 16 గర్వాల్ రైఫిల్స్ విభాగానికి నాయకత్వం వహించారు. పశ్చిమ సరిహద్దులో భారత సైన్యానికి చెందిన అత్యంత కీలకమైన స్ట్రైక్ కోర్ కమాండర్‌గా, ఆర్మీ వైస్ చీఫ్‌గా , సెంట్రల్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా ఆయన సేవలు అందించారు.

సరిహద్దుల్లో వ్యూహాత్మక సవాళ్లు ఎదురవుతున్న తరుణంలో ఆయన అనుభవం దేశానికి ఎంతో కీలకం కానుంది.నూతన సీడీఎస్ ముందు ప్రస్తుతం అనేక సవాళ్లు వేచి ఉన్నాయి. ముఖ్యంగా ఆర్మీ, నేవీ , ఎయిర్ ఫోర్స్ విభాగాలను ఏకీకృతం చేస్తూ థియేటర్ కమాండ్స్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉంది. దీనితో పాటు, ఐరోపా , పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధాల కారణగా మారుతున్న యుద్ధ తంత్రాలకు అనుగుణంగా భారత సాయుధ దళాలను ఆధునీకరించడం, అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి అంశాలపై ఆయన ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంటుంది. ఎన్ఎస్సీఎస్ నుంచి సీడీఎస్ పదవికి ఎంపిక కావడం ద్వారా వ్యూహాత్మక నిర్ణయాల్లో ఆయనకు ఉన్న పట్టు రక్షణ రంగానికి అదనపు బలం కానుంది.మరోవైపు, భారత నౌకాదళానికి కూడా నూతన సారథిని ప్రభుత్వం ఖరారు చేసింది. వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ తదుపరి నేవీ చీఫ్ గా నియమితులయ్యారు. ప్రస్తుతం నేవీ వైస్ చీఫ్‌గా పనిచేస్తున్న ఆయన, మే 31న రిటైర్ కానున్న అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. కమ్యూనికేషన్ , ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ నిపుణుడైన స్వామినాథన్, గతంలో ఐఎన్ఎస్ విక్రమాదిత్య యుద్ధనౌకకు , వెస్టర్న్ ఫ్లీట్‌కు కమాండర్‌గా పనిచేశారు. రక్షణ రంగంలోని ఈ కీలక మార్పులతో భారత భద్రతా వ్యవస్థ మరింత పటిష్టం కానుంది. అజిత్ డోవల్, రాజా సుబ్రమణి మధ్య ఉన్న అనుబంధం కేవలం ఉన్నతాధికారుల మధ్య ఉండే సంబంధం మాత్రమే కాదు.

అది జాతీయ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక బంధం. జాతీయ భద్రతా సలహాదారు గా డోవల్ దేశ రక్షణ వ్యూహాలను రచిస్తుంటే, ఆయన కార్యాలయంలో సైనిక సలహాదారుగా ఉన్న సుబ్రమణి ఆ వ్యూహాలకు సైనిక రూపాన్ని ఇస్తూ అత్యంత సన్నిహితంగా పనిచేశారు. గత సీడీఎస్ అనిల్ చౌహాన్ తరహాలోనే, డోవల్ పర్యవేక్షణలో దేశ భద్రతా సవాళ్లపై పూర్తి పట్టు సాధించిన వ్యక్తి కావడం వల్లే రాజా సుబ్రమణికి ఈ అత్యున్నత పదవి దక్కింది. కీలకమైన భద్రతా నిర్ణయాల్లో డోవల్ నమ్మకస్తుడైన సలహాదారుగా గుర్తింపు పొందడమే సుబ్రమణి నియామకానికి ప్రధాన కారణమైంది.

## ప్రధాని షెడ్యూల్ ఇదే

**హైదరాబాద్,** ప్రధానమంత్రి మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తెలంగాణ వస్తున్నారు. దీని కోసం తెలంగాణ బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ పర్యటన రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కీలకమైన మలుపుగా భావిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత పూర్తి ఉత్సాహంతో ఉన్న భారతీయ జనతా పార్టీ శ్రేణులు, ప్రధాని రాకకు పురస్కరించుకొని భారీ ఏర్పాట్లు చేశాయి. ఈ పర్యటన కేవలం రాజకీయ ప్రాధాన్యత కలిగింది. సుమారు 8వేల కోట్ల విలువైన అభివృద్ధి ఫలాలను తెలంగాణ ప్రజలకు అందించే లక్ష్యంతో సాగుతుంది. ప్రధాని మోదీ ఈ పర్యటనలో భాగంగా వివిధ కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను కల్పించే అవకాశం ఉంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వద్ద 2,360 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఈ స్మార్ట్ సిటీకి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇది పారిశ్రామిక రంగంలో తెలంగాణకు కొత్త దిశకు చూపించనుంది. 3175 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న గూడెబెల్లూరు మహబూబ్‌నగర్ జాతీయ రహదారి పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేయనున్నారు. 611 కోట్లతో మల్లాపూర్ వద్ద ఏర్పాటు చేయనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్‌కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. 1243 కోట్లతో పూర్తి చేసిన కాజీపేట-విజయవాడ ట్రిపులింగ్ పనులకు ప్రధాని జాతీకి అంకితం చేస్తారు.వరంగల్ జిల్లలో 200 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ టెక్స్ టైల్ పార్క్ తెలంగాణ చేనేత, వస్త్ర రంగానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి సహాయపడుతుంది. ప్రధాని మోడీ ఆదివారం మధ్యాహ్నం తెలంగాణకు చేరుకోనున్నారు. ఆయన పర్యటన అత్యంత పకడ్బందీగా సాగేలా అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. మధ్యాహ్నం 2.50 గంటలకు కర్ణాటక నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్ట్ చేరుకుంటారు. హెలీకాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.30 గంటలకు హెచ్ఐసీసీకి చేరుకొని అక్కడ 8000కోట్ల విలువై వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4.10 నిమిషాలకు హైటెక్ సిటీ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన సింధూ ఆసుపత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకని బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో గుజరాత్‌లో జామ్‌నగర్‌కు బయల్దేరారు. ప్రధాని పర్యటన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు

## దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి లోకేష్

**ఇంద్రకీలాద్రి** విజయవాడ ఇంద్రకిలాద్రి అమ్మ వారిని ఐటీ శాఖ మంత్రి, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దర్శించుకున్నారు. అయనకు దేవాదాయ కమీషనర్ రాంచంద్రమోహన్,ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి చైర్మన్ బొర్ర రాధా కృష్ణ పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. అమ్మ వారి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేసారు. అమ్మ వారిని దర్శనం తరువాత అధికారులు వేద పండితులచే ఆశీర్వాదం కల్పించి అమ్మ వారి చిత్రపటాన్ని,అమ్మ వారి ప్రసాదాన్ని అందించారు. లోకేష్ రాకతో అమ్మ వారి ఆలయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ఆలయ అభివృద్ధి గురించి ఆలయ అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మ వారి దర్శనం కల్పించాలని ఆలయ అధికారులకు సూచించారు.

# తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలి**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించి తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం కల్పించిన సౌకర్యాలు, దిగుబడి వివరాలు, హమాలీల గురించి ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే జాప్యం చేయకుండా తూకం వేయాలని, అందుకు సరిపడా హమాలీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని తెలియజేశారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు. ఎంత వరకు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పూర్తయింది అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించే అవకాశం ఉందని, జాప్యం చేయకుండా తరలించాలని, మిల్లుల్లో ధాన్యం బస్తాలు త్వరగా అన్ లోడ్ అయ్యేలా పర్యవేక్షణ చేయాలని అధికారులకు తెలిపారు. తనిఖీలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్, తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో నెలల తరబడి

# రైతుల పడిగాపులు

**వనపర్తి** .జిల్లాలో సివిల్ సప్ లై అధికారులు పూర్తిగా విఫలం. క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించాలి.బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తున్నా రైతుల గోస అ ధికారులకు పట్టదా అని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం రోజున బిసి నాయకుల సమావేశంలో మండిపడ్డారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎటు చూసినా రోడ్డుపైన మొక్కలు, వడ్లు అరబోసి ఉండడంతో వ్యవసాయ మార్కెట్ కి వెళ్లి కొనుగోలు కేంద్రాలలో అక్కడ పరిశీలించగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న దన్నోజు అరవింద్ చారి ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ వడ్లు, మొక్కజొన్నలు సకాలంలో కొనుగోలు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం మౌలిక వసతులు కూడా లేని పరిస్థితుల్లో మార్కెట్ యార్డుల్లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు తరబడి ధాన్యం దగ్గర పడిగాపులు కాసే విధంగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. చలికి, ఎండకు, వానకు సంబంధం లేకుండా ప్రతి నెల క్రమం తప్పకుండా ప్రభుత్వం అధికారులకు వేతనాలు చెల్లిస్తుంటే, రైతులు మాత్రం ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా నెలల తరబడి నిరీక్షించాల అని ప్రశ్నించారు. కేవలం పైపై సమీక్షలు చేస్తే సరిపోదని, అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిలదీశారు. జిల్లాలో సివిల్ సప్లై వ్యవస్థ సక్రమంగా పని చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని, అలా జరగనప్పుడు దళారులు రైతులను నిలువున ముంచి తక్కువ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, తక్షణమే ధాన్యం కాంటాలు చేసి ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేయాలని లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా బిసి పొలిటికల్ జేఏసీ నాయకులు యశ్వంత్ గౌడ్, శివ, శేఖర్, రాజు, మహేందర్ నాయుడు, అంజి యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ అభివృద్ధికి

# రైల్వే ప్రాజెక్టులు కీలకం

**- యాదవ కుల జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్...**



**రేణిగుంట** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో రైల్వే జోన్ల ఏర్పాటు మైలురాయిగా నిలుస్తుందని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధిని వివరిస్తూ రాయలసీమ ప్రాశస్త్యాన్ని మరియు ఇక్కడి అవసరాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.?ఒకప్పుడు రతనాలసీమగా విరాజిల్లిన రాయలసీమలో అపారమైన సహజ వనరులు మరియు ఎంతో సారవంతమైన భూములు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి పూర్వవైభవం రావాలంటే పారిశ్రామిక, రవాణా రంగాలు బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాయలసీమ ప్రాంతాన్ని కూడా రైల్వే జోన్లుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనివల్ల ఇక్కడి నిరుద్యోగ యువతకు అపారమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, యువత అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నా సరైన అవకాశాలు లేక వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమకు బుల్లెట్ ట్రైన్లు, గూడ్స్ రైళ్లు, నేషనల్ బ్రాడ్ గేజ్ లైన్ల విస్తరణ తక్షణ అవసరమని ఆయన పేర్కొన్నారు.?అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతిని ప్రత్యేక రైల్వే జోన్ గా ప్రకటించాలని వెంకటాద్రి యాదవ్ కోరారు. స్వామివారి దర్శనం కోసం ప్రతిరోజూ దేశ విదేశాల నుండి వచ్చే వేలాది మంది భక్తులకు రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ యువత ప్రతిభావంతులని, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తే అన్ని రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు.?విశాఖ రైల్వే జోన్ తో పాటు రాయలసీమ ప్రాజెక్టులు కూడా పూర్తయితేనే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. గూగుల్ డేటా సెంటర్ వంటి సంస్థల వల్ల ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుందని, రవాణా వ్యవస్థ మెరుగుపడటం వల్ల వాణిజ్య పరంగా రాష్ట్రం ముందంజలో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొని రాయలసీమ అభివృద్ధికి మద్దతు తెలిపారు

# 2 సీట్ల పార్టీ - విజయ్‌కు వీసీకే గండం !

**చెన్నై** తమిళనాడు రాజకీయం ప్రస్తుతం విడుతలై చిరుతైగల్ కట్చి అధినేత తోల్ తిరుమావళవన్ చుట్టూ తిరుగుతోంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం పార్టీతో పొత్తు విషయమై తిరుమావళవన్ అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో ఆయన ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడమే కాకుండా, తెర వెనుక భారీ షరతులు విధిస్తున్నారరు. దీంతో విజయ్ రాజకీయ ప్రయాణానికి ఆరంభంలోనే గట్టి సవాళ్లు ఎదురవుతున్నాయి.పొత్తులో భాగంగా వీసీకే అధినేత అత్యంత కీలకమైన డిప్యూటీ సీఎం పదవిని కోరుతున్నట్లు సమాచారం. కేవలం సీట్ల సర్దుబాటుతో సరిపెట్టుకోకుండా, అధికారంలో సమాన వాటా ఉండాలని ఆయన పట్టుబడుతున్నారు. దశాబ్దాలుగా ద్రావిడ పార్టీల నీడలో ఉన్నా దక్కని గౌరవం, విజయ్ పార్టీ ద్వారా సాధించుకోవాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. ఒకవేళ పొత్తు కుదిరితే ప్రభుత్వంలో వీసీకేకు కీలక ప్రాతినిధ్యం ఉండాలనే షరతుపై ఆయన వెనక్కి తగ్గడం లేదని చెబుతున్నారు. మరోవైపు నియోజకవర్గాల విషయంలోనూ తిరుమావళవన్ పట్టు విడవడం లేదు. ముఖ్యంగా తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాన్ని తన పార్టీకి కేటాయించాలని ఆయన డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ స్థానం నుంచి విజయ్ గెలిచారు. రాజీనామా చేస్తున్నారు. ఆ స్థానాన్ని పొందడం ద్వారా అసెంబ్లీలో తన పార్టీ బలాన్ని పెంచుకోవాలని ఆయన యోచిస్తున్నారు. కేవలం రెండు సీట్లు ఉన్న పార్టీకీ ఉప ముఖ్యమంత్రి వంటి కీలక పదవులపై హామీ ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని విజయ్ సన్నిహితులు భావిస్తున్నారు. సీఎం పదవి కోసం.. విజయ్ రాజీపడ్డారన్నప్రచారంజరుగుతోంది. మొత్తానికి తమిళనాడు రాజకీయాల్లో సీనియర్ నేత తిరుమావళవన్ తన అనుభవంతో యువ నేత విజయ్‌కు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. అటు డీఎంకే, ఇటు టీవీకేల మధ్య దోబూచులాడుతూ తన పార్టీ ప్రయోజనాలే పరమావధిగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఇవాళ ఆయన తన మద్దతు ఎవరికో ప్రకటించే అవకాశం ఉంది. విజయ్ తన డిమాండ్లకు అంగీకరిస్తే ఆయన మద్దతు లేఖ గవర్నర్ కు ఇస్తారు. లేకపోతే.. ఆయన నిర్ణయాన్ని వాయిదా వేసుకునే అవకాశం ఉంది.

# తణుకులో కిలాడే లేడీ

**ఏలూరు,** పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి వంచిస్తున్న ఘటనలు అనేకం వెలుగుచూస్తున్నాయి. ఆ కోవలోనే తాజాగా బంగారం కూడా చేరింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో వెలుగుచూసిన ఒక భారీ ఆర్థిక మోసం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. అధిక వడ్డీ ఆశ చూపి, తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామంటూ ఒక కిలాడీ జంట అమాయక ప్రజలను, ముఖ్యంగా మహిళలను నమ్మించి కోట్లాది రూపాయల మేర టోకరా వేసింది. సుమారు 25 కోట్ల రూపాయల మేర సాగిన ఈ భారీ కుంభకోణంలో బాధితులు ఇంకా ఉన్నారనే ప్రచారం జరుగుతుంది. బాధితుల కథనం ప్రకారం.. తణుకు పట్టణానికి చెందిన స్నేహలత, దుర్గాప్రసాద్ అనే దంపతులు లక్ష రూపాయలకు నెలకు 10 వేల నుండి ఏకంగా 30 వేల రూపాయల వరకు వడ్డీ ఇస్తామని నమ్మబలికారు. కేవలం వడ్డీ మాత్రమే కాకుండా బయట మార్కెట్ ధరతో సంబంధం లేకుండా కేవలం 12 వేల రూపాయలకే గ్రాము బంగారం ఇప్పిస్తామంటూ ఆశ చూపారు. వీరి మాటలు నమ్మిన పలువురు మహిళలు తమ వద్ద ఉన్న నగదుతో పాటు బంధువులు, స్నేహితుల వద్ద నుంచి కూడా అప్పులు తెచ్చి మరీ ఈ జంటకు అప్పగించారు. మొదట్లో నమ్మకం కలిగించడం కోసం కొందరికి వడ్డీలు చెల్లించి, ఆపై చేతులు ఎత్తేయటంతో ఇపుడు వారి చేతిలో మోస పాయిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బాధితుల్లో ఒకరైన ఉషారమ్య తాను 25 లక్షల నగదు, 30 కాసుల బంగారాన్ని సదరు జంటకు ఇచ్చినట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు. అంతేకాకుండా ఆమె ద్వారా ఆమె కుటుంబ సభ్యులు, పరిచయస్తుల నుండి మరో 40 లక్షల నగదు, 60 కాసుల బంగారాన్ని కూడావారికి ఇచ్చినట్లు చెబుతున్నారు. మరో బాధితురాలు శైలజ సైతం తనకు జరిగిన అన్యాయాన్ని మీడియా ముందు ఏకరువు పెట్టారు. ఆమె నుంచి 36 కాసుల బంగారం, 44 లక్షల రూపాయల నగదును ఈ జంట కాజేసినట్లు వివరించారు. నగదు బదిలీకి సంబంధించిన వీడియోలు, ఇతర పక్కా ఆధారాలు తమ వద్ద ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేసిన బాధితులను ఈ కిలాడీ జంట రకరకాలుగా భయాందోళనలకు గురిచేసినట్లు తెలుస్తోంది. బాధితులపైనే తప్పుడు ఆరోపణలు చేయడమే కాకుండా వారి ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని, పరువు తీస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు విరు ఆరోపిస్తున్నారు.కాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న దుర్గాప్రసాద్ గతంలో ఒక బంగారు దుకాణంలో గుమస్తాగా పనిచేసిన అనుభవం ఉండటంతో అదే రంగానికి చెందిన పలువురు వ్యాపారులను కూడా ఈ మాయాజాలంలోకి లాగి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారం పై దళిత ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చోళ్ల రాజు ఆధ్వర్యంలో బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. అటు పోలీసులు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. కోట్లాది రూపాయల మోసం జరగడంతో ఈ అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇటువంటి ఆకర్షణీయమైన పథకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# నిరసన దీక్షకు దిగిన వీహెచ్

**హైదరాబాద్,** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆమరణ నిరాహారదీక్షను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన దీక్షకు దిగారు. బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆయన దీక్షను ప్రారంభించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీల అభ్యున్నతి జరగాలంటే, ముందుగా వారి జనాభా ఎంత ఉందో స్పష్టంగా తెలియాలని వీహెచ్ వాదిస్తున్నారు. జనగణనలో బీసీ కులాలను కూడా లెక్కించడం ద్వారానే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన న్యాయం జరుగుతుందని చెబుతున్నారుమే 8వ తేదీ లోపు ఈ విషయంలో స్పష్టత ఇచ్చిన తర్వాతే ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు రావాలని వీహెచ్ గతంలోనే అల్టిమేటం ఇచ్చారు. ఈ లోపు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం, తాను రాసిన లేఖలకు జవాబు లేకపోవడంతో ఆయన ఈరోజు దీక్షను ప్రారంభించారు. కేవలం బీసీల హక్కుల కోసమే ఈ పోరాటమని ఆయన స్పష్టం చేశారు.

# టీసీఎస్ నాసిక్ కేసు

**- నిందితురాలు నిదా ఖాన్కు ఆశ్రయం కల్పించిన ఆరోపణలపై ఎంఐఎం కార్పొరేటర్ అరెస్ట్**

**నాసిక్** టీసీఎస్ నాసిక్ మతమార్పిడి మరియు లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితురాలు నిదా ఖాన్, పోలీసుల నుండి తప్పు?ంచుకుని దాదాపు 25 రోజుల పాటు పరారీలో ఉండటానికి సహాయం చేసినట్లు మహారాష్ట్ర పోలీసులు ఎంఐఎం కార్పొరేటర్ అబ్దుల్ మతీన్ పటేల్ను అదుపులోకి తీసుకున్నారు. పటేల్ తన అధికార పరిధిలోని ఒక అపార్ట్మెంట్లో నిదా ఖాన్కు ఆశ్రయం కల్పించి, ఆమె పోలీసులకు దొరకకుండా దాచిపెట్టినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ఈ మేరకు నాసిక్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (ఃఔా) సెక్షన్ 249 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు



**నెల్లూరు** కొడవలూరు మండలం రేగడిచెలిక వద్ద మహానాడు ఏర్పాట్లను ఎంపీ బీద మస్తాన్ రావుతో కలిసి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, తదితరులు అయనకు ఏర్పాట్లను వివరించారు.సోమిరెడ్డి మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు జరగనుంది. కొడవలూరు మండలం రేగడిచెలిక వద్ద మహానాడు ఏర్పాట్లను ఎంపీ బీద మస్తాన్ రావుతో కలసి పరిశీలించాను.. మే 27, 28, 29 తేదీల్లో మహానాడు అంగరంగ వైభవంగా జరగబోతోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా నెల్లూరులో మహానాడు నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందని అన్నారు.ఇఫ్ కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో చాలా విశాలమైన స్థలంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. 200 ఎకరాలు సభా ప్రాంగణానికి, మరో 300 ఎకరాలు వాహనాల పార్కింగ్ కు సిద్ధమవుతున్నాయి. దశాబ్దాలుగా మహానాడుకు హాజరవుతున్నాం..నాంపల్లి గ్రౌండ్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ కు కార్యకర్తలతో కలిసి నడిచిపోయిన రోజులు ఇంకా గుర్తున్నాయి. నెల్లూరులో గతంలో అనేక సభలు నిర్వహించాం..మహిళా సదస్సు, సారా వ్యతిరేక ఉద్యమ సభతో పాటు అనేక ర్యాలీలు, సభలు విజయవంతంగా నిర్వహించాం. తొలిసారిగా మహానాడు నిర్వహించే అవకాశం వచ్చింది. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు నాయకత్వంలో చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు అంగరంగ వైభవంగా జరగబోతోంది. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు 13వ తేదీన మహానాడు ప్రాంగణంలో కమిటీలతో సమీక్ష నిర్వహించబోతున్నారని అన్నారు.

# లైంగిక వేధింపులు

**- అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం**

**బాపట్ల** బాపట్ల జిల్లా నిజాంపట్నానికి చెందిన ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని, అధికార పార్టీ జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం సంచలనం సృష్టిస్తోంది. తనను గెస్ట్ హౌస్కు రావాలని ఒత్తిడి చేశారని, లొంగకపోతే ఉద్యోగం తీయిస్తానని బెదిరించారని బాధితురాలు శివకుమారి ఆసుపత్రి నుంచి విడుదల చేసిన వీడియోలో ఆరోపించారు. సుబ్బయ్య వల్ల తన ప్రాణాలకు హాని ఉందని, ఇలాంటి వారు రాజకీయాల్లో ఉండటం మహిళా లోకానికే అవమానమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సుబ్బయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు పోరాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు

# ఒంటికి నిప్పంటించుకున్న టీవీకే కార్యకర్త

**చెన్నై** తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంతో మనస్తాపం చెందిన టీవీకే కార్యకర్త కిరోసిన్ పోసుకుని ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. తిరునెల్వేలి జిల్లాలోని సెట్టికుళం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అక్కడున్న వారు మంటలార్పి అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కన్యాకుమారి వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని ఇసక్కియప్పన్ అనే వ్యక్తిగా గుర్తించారు. అతడు పుతుమనై గ్రామ టీవీకే కార్యదర్శిగా పనిచేస్తున్నాడు.

# ప్రధాని సభకు బందోబస్తు కోసం ఏర్పాట్లు పూర్తి

**సికింద్రాబాద్** ఆదివారం జరిగే ప్రధాని నరేంద్ర మోడీ సభ బందోబస్తు కోసం ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ట్రాఫిక్ మళ్లింపుల దృష్ట్యా ప్రజలకు ముందస్తు సూచనలు చేస్తున్నాము..జాగ్రత్తలు పాటించాలి. లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నాం..సభకు వచ్చే ప్రజలకు తగ్గట్టు ఏర్పాట్లు చేశామని మల్కాజ్ గిరి సీపీ సుమతి అన్నారు. శాంతి భద్రతలు,ట్రాఫిక్,టాస్క్ ఫోర్స్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సభను ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. 2 వేల మంది పోలీసులు,620 మంది ట్రాఫిక్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. డీసీపీ స్థాయిలో 3,అదనపు డీసీపీ లు, ఎసిపి లు,ఇన్స్పెక్టర్లు,సబ్ ఇన్స్పెక్టర్ లు బందోబస్తులో ఉంటారు. సభకు 2620 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చేశాం. 4 గంటల ముందే పరేడ్ మైదానం పరిసర ప్రాంతాలను పోలీసుల అదుపులోకి తీసుకుంటామని అన్నారు.పరేడ్ మైదానం పరిసర ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. ఎంట్రీ గేట్ లో నాన్ పర్మిటెడ్ వస్తువులకు అనుమతి లేదు. డ్రోన్లు నిషేధిత ప్రాంతంగా ప్రకటించాం. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుంది. డ్రోన్లు ఎగురవేయడం నిషిద్ధం..బోయినపల్లి,మారేడుపల్లి,బేగంపేట పరిసరాల్లో ప్రత్యేక భద్రత వ్యవస్థ ఉంటుంది. ట్రాఫిక్ మళ్లింపులకు సంబంధించి డీసీపీ లు,ఎసిపి లు పర్యవేక్షిస్తారు. 8 చోట్ల పార్కింగ్ వసతి ఏర్పాటు చేశాము.. బైసన్ పోలో,బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ ఇతర ప్రాంతాలలో ఉత్తర తెలంగాణ వాళ్లకు పార్కింగ్ కు అనుమతి ఉంది. 3000 బస్సులకు,కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పించాం. 700 బస్సులకు పార్కింగ్ వసతి కల్పించాము. పఠాన్ చేరు,చాంద్రాయణ గుట్ట నుండి వచ్చే వాళ్లకు పబ్లిక్ గార్డెన్, ఎల్బీ స్టేడియం ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశాం. సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి..వేసవి దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె అన్నారు.

# బీసీ హాస్టళ్లు బేష్

- ఐవీఆర్ఎస్ సర్వేలో టాప్ ప్లేస్
- సంక్షేమ హాస్టళ్లలో 78.20 శాతంతో అగ్ర స్థానంలో బీసీ హాస్టళ్లు
- విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణలో వెల్లడి
- కూటమి ప్రభుత్వం రాకతో బీసీ బిడ్డల చదువుకు ప్రాధాన్యం
- అధికారంలోకి రాగానే గత ప్రభుత్వపు రూ.110 కోట్ల డైట్ బకాయిల చెల్లింపు

**అమరావతి :** కూటమి ప్రభుత్వం రాకతో బీసీ బిడ్డల విద్యకు ఆసరాగా నిలిచే హాస్టళ్లు మెరుగైన పనితీరుతో ముందంజలో నిలుస్తున్నాయి. మౌలిక సదుపాయల కల్పన, ఆరోగ్యకరమైన మెనూ, బోధనలతో రాష్ట్ర స్థాయిలో బీసీ హాస్టళ్లు అగ్రగామిగా నిలిచాయి. పరిశుభ్రమైన వాతావరణం, పరిశుద్ధమైన తాగునీటి కల్పన, ఆరోగ్యభద్రతతో కూడిన విద్యను అందించడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల మనస్సును బీసీ హాస్టళ్లు గెలుచుకున్నాయి. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వ ఐవీఆర్ సర్వేలో మిగిలిన సంక్షేమ హాస్టళ్లకంటే బీసీ సంక్షేమ హాస్టళ్లు 78.02 శాతం సంతృప్త స్థాయిలతో ప్రథమ స్థానంలో నిలిచి ఔరా అనిపించుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1110 బీసీ బాలురు, బాలికల హాస్టళ్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో బీసీ సంక్షేమ హాస్టళ్లు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయి. నిధులు విడుదల చేయకపోవడంతో మరమ్మతులు సైతం నోచుకోలేకపోయాయి. కనీసం డైట్ బిల్లు కూడా చెల్లించకపోవడంతో బీసీ బిడ్డలు అర్థాకలితో నరకం చూశారు. కాస్మోటిక్ ఛార్జీలు సైతం చెల్లించిన పాపానపోలేదు. దినదిన గండంగా ఆ అయిదేళ్లు బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులు కాలం నెట్టుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రాకతో ఇతర సంక్షేమ హాస్టళ్లతో పాటు బీసీ సంక్షేమ హాస్టళ్లకు మంచిరోజులు ప్రారంభమయ్యాయి. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా బీసీ బిడ్డల ఆకలి తీర్చేలా రూ.110 కోట్ల మేర డైట్ బకాయిలను చెల్లించారు. నాటి నుంచి ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. కాస్మోటిక్ ఛార్జీలను సైతం విద్యార్థులకు సకాలంలో చెల్లిస్తున్నారు. 23 నెలల కాలంలో బీసీ హాస్టళ్ల మరమ్మతులు, ఇతర నిర్మాణాల కోసం రూ.100 కోట్లు వెచ్చించారు. రూ.2 కోట్లతో 104 హాస్టళ్లలో విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ అందజేయడానికి ఎస్.ఆర్. శంకరన్ రిసోర్స్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో బీసీ బిడ్డలు 85.99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

# శ్రీశైలంలో సైబర్ మోసం

శ్రీశైల మహా క్షేత్రంలో సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. నకిలీ వెబ్సైట్లతో సైబర్ మోసగాళ్లు. భక్తుల నిలువుగా దోచుకుంటున్నారు. తాజాగా ఢిల్లీకి చెందిన ఆనంద్ కుమార్ మల్లికార్జున్ సదన్ లో ఏసీ గదులను ఓ వెబ్సైట్ ద్వారా బుక్ చేసుకున్నారు ఇందుకోసం పేటియం ద్వారా 15 వేల రూపాయలు చెల్లించారు. సంబంధిత యాత్రికులు గదుల కోసం సంప్రదించగా అక్కడ గదులు బుకింగ్ జరగలేదని తెలిసింది. దీంతో బాధితులు మోసపోయారు గుర్తించారు


# మండపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

**- ఇద్దరు స్పాట్ డెడ్**



తూర్పుగోదావరి జిల్లా మండపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.స్థానికుల వివరాల ప్రకారం.. మండపేట బైపాస్ రోడ్‌లోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఇసుక టిప్పర్ లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరూ ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

# 'రణబాలి' నుంచి స్పెషల్ గ్లింప్స్



టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా, ఆయన నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' నుంచి ఒక ప్రత్యేక మేకింగ్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తున్నారు. ఈ మేకింగ్ వీడియోలో 'రణబాలి' పాత్ర కోసం విజయ్ దేవరకొండ పడిన కష్టాన్ని చూపించారు. ముఖ్యంగా సినిమాలోని గుర్రపు స్వారీ సన్నివేశాల కోసం ఎంత తీవ్రంగా శిక్షణ తీసుకున్నాడో ఇందులో హైలైట్ చేశారు. మచ్చిక చేసుకోవడానికి అత్యంత కష్టమైన స్టాలియన్ జాతి గుర్రాలతో విజయ్ ప్రాక్టీస్ చేశారు. ఈ క్రమంలో పలుమార్లు గాయపడినప్పటికీ, పట్టుదలతో శిక్షణ పూర్తి చేసినట్లు వీడియో స్పష్టం చేస్తోంది. సినిమా పట్ల అతడి అంకితభావానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, "తెరపై ఈ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి. అందుకే ఇంత కష్టమైన సీక్వెన్స్ అయినా చేయడానికి నేను సిద్ధపడ్డాను" అని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. సినిమాలోని గుర్రపు స్వారీ సన్నివేశాలు, భారీ యాక్షన్ ఘట్టాలు ముఖ్య ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర యూనిట్ తెలిపింది. 19వ శతాబ్దంలో, 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'రణబాలి' చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# అనకాపల్లి లబ్బరు బొమ్మ

విక్రమ్ సహిదేవ్, సంధ్య విశిష్ట జంటగా నటిస్తున్న రా అండ్ రస్టిక్ థ్రిల్లర్ 'అనకాపల్లి'. ఖగేష్ తమ్మినేని దర్శకుడు. కంద్రేగుల నాయుడుతో కలిసి ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో సినిమా విడుదల కానున్నది. తాజాగా ఈ సినిమా నుంచి 'లబ్బరు బొమ్మ' అంటూ సాగే ఓ మాస్ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. రాంబాబు గోశాల రాసిన ఈ పాటను దేవ్‌జండ్ స్వరపరచగా, శ్రీకృష్ణ, సాహితీ చాగంటి కలిసి ఆలపించారు. తారక్ పొన్నప్ప, నందినీరాయ్‌లపై ఈ పాటను చిత్రీకరించారు. మాస్ ఆడియన్స్‌కి నచ్చేలా ఈ పాటను దర్శకుడు ఖగేష్ తమ్మినేని తెరకెక్కించారు. ఈ చిత్రానికి కథ, కథనం: నక్కిన త్రినాథరావు, కెమెరా: మాయా.వి, నిర్మాణం: భవ్యశ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్.



## మనం చేసే పని మన మనసు చెప్పిన దారిలోనే ఉండాలి

**– శోభిత ధూళిపాళ**



సినీ నటి, హీరో అక్కినేని నాగచైతన్య భార్య శోభిత ధూళిపాళ తన కెరీర్‌తోనే కాకుండా, తన వ్యక్తిత్వంతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. నాగచైతన్యతో వివాహం తర్వాత వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదిస్తూనే, వృత్తి పరంగా కూడా ఆమె బిజీగా ఉంటున్నారు. దుబాయ్‌కు చెందిన ప్రముఖ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ శ్రీలత అడెపల్లి, ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న తెలుగు మహిళలను అభినందిస్తూ ఒక ప్రత్యేక వీడియోను రూపొందించారు. ఈ జాబితాలో శోభిత పేరును కూడా ప్రస్తావించడం విశేషం. ప్రపంచ వేదికలపై తెలుగు వారి ప్రతిభను చాటుతున్న మహిళలందరినీ ఒకే చోట చేర్చి గౌరవించడం అందరినీ ఆకట్టుకుంది. శ్రీలత పోస్ట్‌పై శోభిత స్పందిస్తూ తన జీవిత సూత్రాన్ని పంచుకున్నారు. జీవితంలో మనం చేసే ప్రతి పని మన మనసు చెప్పిన దారిలోనే ఉండాలని... అప్పుడే ఆ క్షణాలు అర్థవంతంగా ఉంటాయని చెప్పారు. ఇతరుల కోసం కాకుండా, మనకు మనం నిజాయతీగా ఉండటం, మనల్ని మనం గౌరవించుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం ద్వారానే సమాజంలో మహిళలు మరింత ఎత్తుకు ఎదుగుతారని తెలిపారు.

## 'భరతనాట్యం 2: మోహినీయాట్టం' మూవీరివ్యూ!



మలయాళంలో డార్క్ కామెడీ నేపథ్యంలో గతంలో 'భరతనాట్యం' అనే సినిమా వచ్చింది. ఆ సినిమాకి సీక్వెల్ గా రూపొందినదే 'భరతనాట్యం 2: మోహినీ యాట్టం'. కృష్ణదాస్ మురళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సైజూ కురుప్ .. సూరజ్ వెంజరమూడు ప్రధానమైన పాత్రలను పోషించారు. ఏప్రిల్ 10వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, 40 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా, ఈ నెల 8వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో తెలుగులోను స్ట్రీమింగ్ అవుతోంది. భరతన్ నాయర్ చనిపోవడంతో, పెద్ద కొడుకైన శశిధరన్ (సైజూ కురుప్)పై కుటుంబ బాధ్యత పడుతుంది. తన తండ్రికి మరో ఫ్యామిలీ ఉందని తెలుసుకున్న శశిధరన్, ఆ కుటుంబాన్ని కూడా సెటిల్ చేయవలసిన బాధ్యత తనపై ఉందని భావిస్తాడు. తన పిన్ని అయిన రుక్మిణికీ .. ఆమె కొడుక్కి వాళ్ల ఊరులోనే కొత్తగా ఒక ఇల్లు కట్టించి ఇస్తాడు. వాళ్లను ఆ కొత్త ఇంట్లో దిగబెడతాడు. ఆ సమయంలోనే, ఆ విలేజ్ కి చెందిన గోవిందరాజన్ (సూరజ్ వెంజరమూడు) వచ్చి వాళ్లను కలుస్తాడు. గోవింద రాజన్ ఆ ఊరులోని మోహినేశ్వరి ఆలయాన్ని గురించి ప్రస్తావిస్తాడు. భరతన్ .. తాను .. బేబీ కలిసి ఆ ఆలయాన్ని నిర్మించామనీ, ఆ నకిలీ టెంపుల్ ద్వారా ఆస్తులు సంపాదించామని చెబుతాడు. అయితే ఇప్పుడు ఆ నిజం బయటపడే ప్రమాదం పొంచి ఉందనీ, అందువలన భరతన్ పై ఆ నేరాన్ని తోసేయాలని నిర్ణయించుకున్నామని అంటాడు. చనిపోయిన భరతన్ కి చెడ్డ పేరు తీసుకురావొద్దని వాళ్లంతా కోరతారు. అయితే 75 లక్షలు ఇస్తే, ఈ కేసు పరిష్కారమవుతుందని చెబుతాడు. శశిధరన్ వాళ్లంతా కూడా అంత డబ్బు ఎక్కడి నుంచి సర్దుబాటు చేయాలా అనే ఆలోచనలో పడతారు. అయితే వాళ్ల ఇబ్బందిని అర్థం చేసుకోకుండా గోవిందరాజన్ టార్చర్ చేయడం మొదలుపెడతాడు.

ఒకానొక సందర్భంలో శశిధరన్ కుటుంబ సభ్యుల చేతిలో అతను చనిపోతాడు. గోవిందరాజన్ మేనల్లుడికి తెలియకుండా అతని శవాన్ని మాయం చేయడానికి వాళ్లు ఎలాంటి ప్రయత్నాలు చేస్తారు? ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటారు? అనేది కథ. అనుకోకుండా ఒక హత్య చేసిన శశిధరన్ కుటుంబ సభ్యులు, ఎవరికీ తెలియకుండా ఆ శవాన్ని అక్కడి నుంచి మాయం చేయాలని నిర్ణయించుకుంటారు. అందుకోసం వాళ్లు పడేపాట్ల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. పిన్ని కుటుంబాన్ని ఆదుకోవడానికి గాను ఆమె ఊరుకు తన కుటుంబంతో వెళ్లిన కథానాయకుడు అక్కడ ఎలా చిక్కుబడ్డాడు అనే అంశమే ఈ కథంలో ప్రధానమైనదిగా కనిపిస్తుంది. ఒక విలేజ్ .. ఒక కుటుంబం .. వాళ్లకి ఎదురైన సమస్యకి కారణమైన మరికొన్ని పాత్రలతో దర్శకుడు ఈ కథను నడిపించాడు. పాత్రలన్నీ కూడా ఒక పరిధిలో సంచరిస్తూ ఉంటాయి. ప్రతి పాత్రను డిజైన్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. ఆ పాత్రల స్వరూప స్వభావాల విషయంలో దర్శకుడు ఎంత క్లారిటీతో ఉన్నాడనే విషయం అర్థమవుతుంది. స్క్రిప్ట్ పెర్ఫెక్ట్ గా ఉండటంతో, కామెడీ టచ్ కరెక్ట్ గా వర్కౌట్ అయింది. ఒక వైపున గోవిందరాజన్ కోసం పోలీసులు వెదుకుతుంటే, మరొక వైపున అతను దాచిన డబ్బుకోసం భాగస్థులు వెతుకుతుంటారు. ఈ రెండు అంశాల చుట్టూ తిరిగే పాత్రల హడావిడి ఆడియన్స్ కి వినోదాన్ని పంచుతుంది. గోవిందరాజన్ శవాన్ని ఎలా వదిలించుకుంటారు? అతను దాచిన డబ్బు ఏమౌతుంది? అనేవి ఆడియన్స్ ఈ కథను చివరివరకూ ఫాలో అయ్యేలా చేస్తాయి. శశిధరన్ .. అతని తల్లి .. గోవిందరాజన్ .. అతని మేనల్లుడి పాత్రలు ప్రధానమైన బలంగా కనిపిస్తాయి. గోవిందరాజన్ శవం విషయంలో తమని భయపెట్టాలనుకున్న అతని మేనల్లుడిని తమ వైపుకు తిప్పుకోవడానికి శశిధరన్ ఫ్యామిలీ ఆడిన డ్రామా ఈ సినిమాలో హైలైట్ గా నిలుస్తుంది. కథలోని ట్విస్టులు ఎప్పటికప్పుడు ఆడియన్స్ ను మరింత ఉత్సాహపరుస్తూ వెళ్లడం బాగుంది. కథ .. స్క్రీన్ ప్లే .. పాత్రలను డిజైన్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. బబ్లూ ఫొటోగ్రఫీ .. కిలి నేపథ్య సంగీతం .. షఫీక్ ఎడిటింగ్ కంటెంట్ కి మరింత బలాన్ని ఇచ్చాయి. కథకి తగిన లొకేషన్స్ మరింతగా కనెక్ట్ చేస్తాయి. ఎక్కడా ఎలాంటి లూజ్ సన్నివేశాలు లేకుండా, మొదటి నుంచి చివరివరకూ వినోదాన్ని పంచే సినిమా ఇది.


## యాక్షన్ సీక్వెన్స్ కోసం

# రిహార్సల్స్



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్'. ఇప్పటికే ఈ సినిమా తాలూకు ఓ షెడ్యూల్ పూర్తయింది. గతంలో విడుదల చేసిన ఆడియో గ్లింప్స్‌కి అద్భుత స్పందన రావడంతో సినిమాపై మరింతగా అంచనాలు పెరిగాయి. తాజాగా ఈ సినిమాలోని కీలకమైన యాక్షన్ ఘట్టాల కోసం హీరో ప్రభాస్ స్పెషల్ రిహార్సల్స్ చేయబోతున్నారట. కాప్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో హై ఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్సెస్ ఉంటాయని, అవే హైలైట్‌గా నిలుస్తాయని చెబుతున్నారు. దాంతో ఈ పోరాట ఘట్టాల్లో పర్‌ఫెక్షన్ కోసం ప్రభాస్ రిహార్సల్స్ చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో ప్రభాస్ చాలా వరకు బరువు తగ్గి కనిపిస్తారని, తొలిసారి పోలీస్ అధికారి పాత్రలో నటిస్తుండటంతో ఫిట్‌నెస్‌పై ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ప్రభాస్ మేకోవర్ అందరినీ సర్‌ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. టీ సీరిస్, భద్రకాళి ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చి 5న ప్రేక్షకుల ముందుకురానుంది.

## ధురంధర్-2 ఓటీటీలోకి వస్తోంది.. అయితే భారత్‌లో కాదు!



బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, మే 14 నుంచి అంతర్జాతీయంగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అయితే, భారత్‌లో మాత్రం ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉండదు. దీంతో భారత ప్రేక్షకులు ఎక్కడ చూడాలనే దానిపై ఆసక్తి నెలకొంది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమా 'రా అండ్ అన్ దేఖా' అనే ట్యాగ్‌లైన్‌తో, దాదాపు 3 గంటల 52 నిమిషాల సుదీర్ఘ రన్‌టైమ్‌తో రానుంది. సెన్సార్ చేయని సన్నివేశాలు, అదనపు ఫుటేజ్‌తో ఈ ప్రత్యేక వర్షన్‌ను విడుదల చేయనున్నారు.

భారత్‌లో ఈ చిత్రాన్ని జియోహాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్‌పై మే 14నే విడుదల చేయవచ్చని కొన్ని కథనాలు సూచిస్తున్నాయి. అయితే, దీనిపై నిర్మాతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సినిమాలోని ఒక పాట రీమిక్స్‌పై కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో, థియేట్రికల్ రిలీజ్ తర్వాత 8 వారాల గ్యాప్ ఇచ్చాకే ఓటీటీలోకి వస్తుందని నిర్మాతలు గతంలో తెలిపారు. మే 14 నాటికి సినిమా విడుదలై సరిగ్గా 8 వారాలు పూర్తవుతుంది. ఈ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు సారా అర్జున్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటివరకు ఈ సినిమా భారత్‌లో రూ. 1,140 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించగా, ప్రపంచవ్యాప్తంగా రూ. 1,791 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. అంతర్జాతీయంగా విడుదల తేదీ ఖరారైనప్పటికీ, భారత్‌లోని ఓటీటీ రిలీజ్‌పై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# చెరువుల పరిరక్షణకు రైతులు సహకరించాలి

## - ఇరిగేషన్ అధికారులు






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని తడగొండ ఊర చెరువు, బోయినిపల్లి మండల కేంద్రంలో కొత్తకుంట, స్తంభంపల్లి ఊర చెరువుల వద్ద 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక –2026, రైతు వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సాగునీటి శాఖ ఆధ్వర్యంలో పూడికతీత మట్టి, కలుపు మొక్కల తొలగింపుపై రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఈఈ శ్రీనివాసులు,మండల వ్యవసాయ అధికారి ప్రణీత, ఏపిఓసబిత, ఇరిగేషన్ ఏ ఈఈలు,ఏఈఓలు,లస్కర్లు, మూడు గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు. చెరువులు, కాలువలను పరిరక్షించడం ప్రతి గ్రామస్థుడి బాధ్యత అని అధికారులు సూచించారు. అనంతరం రైతులు కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేశారు.

# ఏఐ ఆధారిత వాట్సాప్ చాట్‌బాట్ సేవలకు శ్రీకారం చుట్టిన టీజీఎన్‌పీడీసీఎల్

**- రైతులకు సైతం సులభంగా అర్థమయ్యే విధంగా ఏఐ సేవలు**

**- ఏఐ టెక్నాలజీతో వినియోగదారులకు వేగవంతమైన సేవలు**

**- సిరిసిల్ల సర్కిల్ ఎస్.ఈ : వేణు మాధవ్**



సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల సర్కిల్‌లో వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శక సేవలందించేందుకు తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్.పీడీసీ ఎల్) ఏఐ ఆధారిత వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్ తెలిపారు. మే 8, 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ సేవల ద్వారా వినియోగదారులు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తమ సందేహాలను టైప్ చేస్తే, కృత్రిమ మేధ సాంకేతికతతో వాటిని విశ్లేషించి తగిన సమాచారం అందిస్తుందని తెలిపారు.ఈ చాట్‌బాట్ ద్వారా బిల్లు వివరాలు, చెల్లింపు స్థితి, ఫిర్యాదు నమోదు, టికెట్ స్థితి, విద్యుత్ అంతరాయ సమాచారం, హెల్ప్‌లైన్ సేవలు 24ఐ7 అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులకు సులభంగా అర్థమయ్యేలా తెలుగు భాషలో ప్రత్యేకంగా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. వినియోగదారులు 8712481489 నంబర్‌కు వాట్సాప్‌లో మెసేజ్ చేయడం ద్వారా లేదా టీజీఎన్పీడీసీఎల్ వాట్సప్ చాట్బాట్ లింక్‌ను ఉపయోగించి సేవలు పొందవచ్చని తెలిపారు. ఇంట్లో నుంచే విద్యుత్ సేవలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా పొందేందుకు ఈ చాట్‌బాట్ కీలకంగా ఉపయోగపడుతుందని ఎస్ఈ వేణుమాధవ్ స్పష్టం చేశారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**- ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు**

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు : ఏనుగు మనోహర్ రెడ్డి**



**- అక్కెనపల్లి కరుణాకర్ కు సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నేతలు**

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్కెనపల్లి కరుణాకర్‌ను శనివారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన కరుణాకర్‌కు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అక్రమ అరెస్టులతో అణిచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. ప్రజా ఉద్యమాలను అడ్డుకోవడం సాధ్యం కాదని, ఉద్యమకారులకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం,బోయినిపల్లి మాజీ మండల అధ్యక్షులు మేడుదల మల్లేశం, ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, గ్రామ శాఖ అధ్యక్షులు కస్తూరి బాపురెడ్డి, నాయకులు అల్లూరి రవీందర్ రెడ్డి, బోయిని రాజు,తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొన్న మాస్టర్"కేటీఆర్" కుటుంబ సభ్యులు

**- కేటీఆర్ పేరుతో కుమారుడికి నామకరణం**



**- తొలి పుట్టినరోజు మొక్క నాటింపు**

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గంగిపెల్లి రాజశేఖర్–కవిత దంపతులు తమ కుమారుడు "కేటీఆర్" తొలి పుట్టిన రోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొని మొక్క నాటారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన హరిత సేన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.తమ అభిమాన నాయకుడు కేటీఆర్ పేరు కుమారుడికి పెట్టుకోవడం ఆనందంగా ఉందని దంపతులు తెలిపారు. గతంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో కుమారుడికి నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయిని రాజు,గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యుడు కమల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీల సంక్షేమానికి సర్పంచ్ మోహన్ ప్రత్యేక చర్యలు



**- వేసవి దాహార్తి నివారణగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ**

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ నల్ల మోహన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నల్ల మోహన్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఉపాధిహామీ కూలీలు అధిక ఉష్ణోగ్రతల మధ్య పనిచేస్తున్నారని,

# పేదింటి ఆడపడుచు కుటుంబానికి అండగా నిలిచిన విలాసాగర్ గ్రామ ప్రజాప్రతినిధులు

**- రూ.10 వేలు నగదు, పట్టు వస్త్రాలు, బియ్యం వితరణ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో మానవత్వాన్ని చాటే ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాగరం గౌరయ్య కుమార్తె వివాహ వేడుకకు గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ రాజు ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు.వధువు కుటుంబానికి రూ.10 వేల నగదు సాయం అందించడంతో పాటు 25 కిలోల బియ్యం, పట్టువస్త్రాలను అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ గ్రామంలోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అవసరమైన సమయంలో సహాయం చేయడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ రాజు మాట్లాడుతూ గ్రామ ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ కల్లెపల్లి సతీష్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# విద్యా శాఖను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**- ఏ.ఐ.ఎస్.బి.రాష్ట్ర ఉపాధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్**



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్బీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకపోవడం, సీఎం వద్దే శాఖ ఉండి కూడా పట్టించుకోకపోవడంతో కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ హామీలు ఇప్పటికీ అమలు కాలేదని, పెండింగ్ బకాయిల వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. టీసీలు ఇవ్వకుండా విద్యార్థుల నుంచి కళాశాల యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్బీ నాయకులు మెట్టు రాకేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేద్దాం

**బీజేపీ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ శీలం విద్యా సాగర్**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ శీలం విద్యా సాగర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల నిమిత్తం ప్రధాని మోదీ హైదరాబాద్‌కు విచ్చేస్తున్న నేపథ్యంలో, సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ సభకు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సహకారం, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, మౌలిక వసతుల విస్తరణ, పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, తెలంగాణకు కూడా కేంద్రం విశేష ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.దేశాభివృద్ధి, తెలంగాణ ప్రగతికి ప్రధాని మోదీ నాయకత్వం ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ సభకు హాజరై మోదీకి ఘన స్వాగతం పలకాలన్నారు. ముఖ్యంగా యువత, మేధావులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు**



గజ్వేల్(ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులు సుమారు 250 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న అనుమానాస్పద లారీని ఆపి తనిఖీ చేయగా భారీ మొత్తంలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం సరుకును పరిశీలన నిమిత్తం సివిల్ సప్లై కార్యాలయానికి తరలించారు. వాహన డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం, కెఎ 53 4130 నంబర్ గల లారీ కర్ణాటక రాష్ట్రం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్నట్లు సమాచారం. ఘటనపై సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందజేసి, వారి నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

# గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా డి. సత్యనారాయణ బాధ్యతల స్వీకారం




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా డి. సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా పరిశీలించుకుని వెంట ఉంచుకోవాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# యువత స్వశక్తితో రాణించాలి - ఎఫ్ డీ సి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

**ప్రజ్ఞాపూర్‌లో 'స్పందన అండ్ కో' చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయం ప్రారంభం**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో స్పందన–శ్రీనాథ్ దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్పందన అండ్ కో' చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయాన్ని శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఫ్ డి సి మాజీ చైర్మన్,ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ ఛైర్పర్సన్ చందన రవీందర్, వైఎస్ చైర్ పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, స్థానిక కౌన్సిలర్ మన్నే రూప వెంకటేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావంతులైన యువత స్వశక్తితో రాణించాలని, ఇటువంటి కార్యాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. చార్టెడ్ అకౌంటెంట్లు ఆర్థిక క్రమశిక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, స్థానిక వ్యాపారవేత్తలకు, ప్రజలకు ఈ కార్యాలయం ద్వారా మెరుగైన సేవలు అందాలని వారు ఆకాంక్షించారు. స్పందన శ్రీనాథ్ దంపతులు తమ వృత్తిలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం స్పందన శ్రీనాథ్ మాట్లాడుతూ, మాకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, గోలి మమత సంతోష్, అత్తెల్లి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, భాగ్యలక్ష్మి కనకసేన, కొలిచెలిమే భవాని కరుణాకర్, కోట బాబు, బొగ్గుల స్వప్న సురేష్, కప్పు మమతా పోచయ్య, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, సిఏ స్పందన శ్రీనాథ్, కుటుంబ సభ్యులు చండిక రమేష్, పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, బిఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి వచ్చినా అవే సమస్యలు

## - ప్రజాగ్రహాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తించదా?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో భూ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ స్థానంలో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆశతో భూభారతి వ్యవస్థను ప్రవేశపెట్టింది. భూ రికార్డులను సమూలంగా ప్రక్షాళన చేసి, రైతులకు శాశ్వత పరిష్కారం చూపుతామని చేసిన ప్రకటనలు క్షేత్రస్థాయిలో ఆవిరవుతున్నాయి. భూభారతి అమల్లోకి వచ్చినా సమస్యలు తగ్గకపోగా, సరికొత్త సాంకేతిక, పరిపాలన చిక్కులు తోడై రైతుల పాలిట భూ స్వప్నంగా మారుతోంది.

### - ప్రక్షాళన పేరిట పెరిగిన పెండింగ్ దరఖాస్తులు

ధరణిలోని లోపాలను సరిదిద్దేందుకు భూభారతిని తీసుకువచ్చినప్పటికీ, దరఖాస్తుల పరిష్కార వేగం మందగించింది. ధరణి కాలం నాటి 2.45 లక్షల పెండింగ్ దరఖాస్తులకు , భూభారతి ప్రారంభమయ్యాక కొత్తగా వచ్చిన దరఖాస్తులు తోడయ్యాయి. ముఖ్యంగా వారసత్వ బదిలీ , భూ విస్తీర్ణంలో వ్యత్యాసాల సవరణకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ మాడ్యూల్స్‌లో సాంకేతిక లోపాలు ఇంకా వెంటాడుతున్నాయి. ప్రభుత్వం కేవలం పోర్టల్ పేరు మార్చడంపై ఉన్న శ్రద్ధ, క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిష్కారంపై చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### - సమగ్ర భూ సర్వే - మూడేళ్ల నిరీక్షణ తప్పదా?

భూభారతిలో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర భూ సర్వే రైతుల్లో కొత్త ఆందోళనలను రేకెత్తిస్తోంది. అత్యాధునిక రోవర్లు, డ్రోన్ల ద్వారా ప్రతి సెంటు భూమిని కొలుస్తామని ప్రభుత్వం చెబుతున్నా, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం రెండు నుండి మూడు ఏళ్లు పట్టే అవకాశం ఉంది. ఈ లోపు పెండింగ్‌లో ఉన్న లక్షలాది సమస్యల పరిస్థితి ఏమిటన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. సర్వే పూర్తయ్యే వరకు రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లలో జాప్యం జరిగితే సామాన్య రైతులకు సాగు పెట్టుబడి కోసం రుణాలు పుట్టడం కూడా గగనంగా మారే ప్రమాదం ఉంది.

### - 22ఏ జాబితా ఎమ్మెల్యేల హామీలు.. క్షేత్రస్థాయిలో శూన్యం

నిషేధిత భూముల జాబితా (22ఏ) అంశం భూభారతి వచ్చిన తర్వాత మరింత క్లిష్టంగా మారింది. ఎన్నికల సమయంలో ఈ భూములను జాబితా నుండి తొలగిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేలు, ఇప్పుడు నోరు మెదపడం లేదు. అసైన్డ్, దేవాదాయ భూముల సమస్యలపై ప్రభుత్వం నుండి స్పష్టమైన గైడ్‌లైన్స్ రాకపోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో బాధితులు అటు సచివాలయం, ఇటు స్థానిక ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఇచ్చిన హామీలు ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండగా మారాయి. గతంలో కలెక్టర్లకు మాత్రమే ఉన్న అధికారాలను భూభారతి ద్వారా ఆర్డీవోలు, తహశీల్దార్లకు అప్పగించడం అవినీతి కి కొత్త ద్వారాలు తెరిచినట్లయిందని విమర్శలు వస్తున్నాయి. గతంలో కేవలం క్లిక్ 'తో అయ్యే పనులకు కూడా ఇప్పుడు క్షేత్రస్థాయిలో పైరవీలు చేయాల్సి వస్తోంది. రికార్డుల తారుమారు, ఒకరి భూమిని మరొకరి పేరు మీదకు మార్చడం వంటి ఫిర్యాదులు తహశీల్దార్ కార్యాలయాల్లో వెల్లువెత్తుతున్నాయి. భూముల విలువ భారీగా ఉన్న ప్రాంతాల్లో రాజకీయ నాయకుల జోక్యం పెరిగి, అసలైన రైతులు అన్యాయానికి గురవుతున్నారు.




### - ప్రజల్లో పెరిగిపోతున్న అసంతృప్తి

భూభారతి వ్యవస్థ భూ సమస్యలకు పరిష్కారం కాకపోగా, అదనపు భారంగా మారుతోందనేది క్షేత్రస్థాయి వాస్తవం. ప్రజల నుండి వస్తున్న ప్రజావాణి దరఖాస్తుల్లో అత్యధికం భూ వివాదాలే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటనల మోత తగ్గించి, సాంకేతిక లోపాలను యుద్ధప్రతిపాదికన సరిదిద్దాలి. నిరంతరం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు భరోసా కల్పించకపోతే, ఈ అసంతృప్తి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది.

# 98 ఏళ్ల బీజేపీ కార్యకర్త పాదాలకు నమస్కరించిన మోదీ

## - కోల్‌కతాలో భావోద్వేగ దృశ్యం





కోల్‌కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార వేడుకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రదర్శించిన వినమ్రత అందరినీ ఆకట్టుకుంది. కోల్‌కతాలో జరిగిన ఈ కార్యక్రమంలో 98 ఏళ్ల వయసున్న బీజేపీ సీనియర్ కార్యకర్త మఖన్ లాల్ సర్కార్ పాదాలకు మోదీ నమస్కరించి, ఆయన్ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ భావోద్వేగ దృశ్యానికి అక్కడున్న వేలాది మంది కార్యకర్తలు, మద్దతుదారులు హర్షధ్వానాలు చేశారు. మఖన్ లాల్ సర్కార్‌కు పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంది. 1953లో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే ఉద్యమంలో భాగంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీతో కలిసి కశ్మీర్‌లో ఆయన అరెస్టయ్యారు. అలాంటి సీనియర్ నేత వేదిక వద్దకు వచ్చి పలకరించగానే, ప్రధాని మోదీ ఆయన కాళ్లకు నమస్కరించి గౌరవం చాటారు. పశ్చిమ బెంగాల్‌లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలుకుతూ, బీజేపీ తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నూతన ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేసే ఈ చారిత్రక ఘట్టానికి హాజరయ్యేందుకు ప్రధాని మోదీ కోల్‌కతా వచ్చారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న ఆయనకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య, ముఖ్యమంత్రిగా నియమితులైన సువేందు అధికారి ఘనస్వాగతం పలికారు. 'జై శ్రీరామ్' నినాదాలతో మైదానం మారుమోగింది. అంతకుముందు ఓపెన్ టాప్ వాహనంలో ప్రధాని అభివాదం చేస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు.

# వణికిస్తున్న నేపాలీలు

## - పనోళ్లు కాదు.. హత్యలు చేసే ముఠాలు - జాగ్రత్తగా లేకుంటే ప్రాణాలు హరీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో నేపాలి గ్యాంగ్ లు హత్యలకు పాల్పడుతున్నాయి. పనిమనుషులుగా ఇళ్లలో చేరి బంగారం, డబ్బుకోసం హత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన హత్యల్లో నేపాలికి చెందిన వారే ఎక్కువగాఉన్నారు. అందుకే పోలీసులు కూడా తమ ఇళ్లలో పనిమనుషులుగా నియమించుకునే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తక్కువ ఖర్చుకు పనిమనుషులుగా చేరుతున్నారని వారిని చేర్చుకుంటే చివరకు ప్రాణాలు తీసి పరారవుతున్నారన్న విషయాన్ని మర్చిపోవద్దని సూచిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో వరుస హత్యలు, భారీ దోపిడీ ఘటనలు కలకలం రేపుతున్నాయి.

### - ధనవంతుల ఇళ్లే టార్గెట్ గా

నగరంలోని ధనవంతుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పనివాళ్లుగా చేరుతున్న నేపాలీ ముఠాలు కోట్ల రూపాయల నగదు, బంగారాన్ని దోచుకుని పరారవుతున్న తీరు నగరవాసుల్లో భయాందోళనలు కలిగిస్తోంది. వారు పనిచేసే సమయంలోనే రెక్కీ చేసి మరీ కొన్ని నెలలు వేచి ఉండి దోచుకు వెళుతున్నారు. నేపాలి నుంచి వచ్చిన వారు తక్కువ నెలసరి జీతానికి పనిలోకి వస్తారు. తక్కువ ఖర్చుకు వస్తుండటంతో ఎక్కువ మంది వారిని పనిమనుషులుగా, సెక్యూరిటీగా, వంట మనుషులుగా తీసుకుంటున్నారు.

### - వరస దోపిడీలు..

ఈ ఏడాది ఫిబ్రవరి 6న నందగిరి హిల్స్‌లోని ఓ వ్యాపారి ఇంట్లో పని చేస్తున్న భూపిందర్ షా అనే నేపాలీ యువకుడు, ఇంట్లోని ఇతర పనివారికి మత్తుమందు ఇచ్చి దాదాపు రెండు కోట్ల





విలువైన బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. అనంతరం మార్చి 14న జూబ్లీహిల్స్‌లో మరో వ్యాపారి ఇంట్లో పనిచేసే ఇద్దరు నేపాలీలు, యజమాని ఇంట్లో లేని సమయంలో లాకర్లు పగలగొట్టి రూ.3 కోట్ల విలువైన నగలను దోచుకెళ్లారు. తాజాగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ యువతి, యజమాని భార్యను హత్య చేసి నగదు, నగలతో పరారవడం సంచలనంగా మారింది. ఈ మూడు ఘటనల తీరు ఒకే ముఠా పనితీరును తలపిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

### - పక్కా స్కెచ్ తోనే..

నిందితులు ముందుగా ధనిక కుటుంబాలను టార్గెట్‌గా ఎంచుకుని పనిమనుషులుగా ఇళ్లలో చేరుతున్నారు. కొన్ని వారాల పాటు నమ్మకంగా పనిచేస్తూ కుటుంబ సభ్యుల అలవాట్లు, ఇంట్లోని భద్రతా పరిస్థితులు, నగదు మరియు నగలు ఎక్కడ ఉంచుతారనే వివరాలను గమనిస్తున్నారు. సరైన సమయం కోసం వేచి చూసి, యజమానులు బయటకు వెళ్లినప్పుడు లేదా అప్రమత్తంగా లేని సమయంలో తమ అనుచరులతో కలిసి దోపిడీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అరెస్టయిన నిందితులను విచారించగా ఈ దోపిడీల వెనుక నేపాల్‌లో ఉన్న కొందరు కీలక వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పనికి వెళ్లే వ్యక్తుల ఎంపిక నుంచి, దోపిడీ తర్వాత ఎలా తప్పించుకోవాలనేది కూడా ముందుగానే సూచిస్తున్నారు. దోచుకున్న సొత్తుతో వెంటనే పుణె, ముంబై వంటి నగరాలకు వెళ్లి అక్కడి నుంచి నేపాల్ చేరేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# గచ్చిబౌలిలో 15 లక్షల టన్నుల చెత్త కొండ

## - ఐకియా సమీపంలో ఆరంతస్తుల ఎత్తులో పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాదులో 15 లక్షల టన్నుల చెత్త కొండ ఎక్కడుందో తెలుసా? అది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు, హైటెక్ హంగులతో నిత్యం మెరిసిపోయే గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లోనే ఉంది. ఐకియా స్టోర్‌కు సమీపంలో, ఆకాశహర్మ్యాల మధ్య పేరుకుపోయిన ఈ నిర్మాణ వ్యర్థాల (సిడిడి) గుట్టలు ఇప్పుడు నగరం ముందున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా నిలిచాయి. కొన్నేళ్లుగా ఇక్కడ పేరుకుపోయిన ఈ వ్యర్థాలు దాదాపు ఆరు నుంచి ఏడు అంతస్తుల ఎత్తుకు చేరాయి. రోజూ వేలమంది ప్రయాణించే ఈ మార్గంలో ఇవి సాధారణ దృశ్యంగా మారాయి. అధికారుల అంచనా ప్రకారం, ఈ 15 లక్షల టన్నుల చెత్తను తొలగించడానికి, అనువైన పరిస్థితుల్లో కూడా ఏడాదికి పైగా సమయం పట్టవచ్చు. ఈ సమస్య పరిష్కారానికి రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి. సృజన తెలిపారు. మొదటిది, వ్యర్థాలను అక్కడికక్కడే ప్రాసెస్ చేసి, ఇసుక వంటి నిర్మాణ సామగ్రిగా మార్చడం. ఇది పర్యావరణానికి మంచిదైనా, చాలా నెమ్మదైన ప్రక్రియ. రెండోది, చెత్తను వేరే ప్రాంతానికి తరలించడం. ఇది వేగంగా పూర్తయినా, రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో భారీ వాహనాలతో తరలించడం అత్యంత క్లిష్టమైన పని. ఈ మొత్తం ప్రక్రియకు రూ.70 కోట్ల నుంచి రూ.90 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. అయితే, దీనికి ప్రధాన అడ్డంకిగా భూ వివాదం మారింది. వ్యర్థాలున్న ఈ స్థలంపై ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు శాశ్వత చర్యలు తీసుకోవడం కష్టమని, కోర్టు తీర్పు తర్వాతే స్పష్టత వస్తుందని కమిషనర్ వివరించారు.

# పాగాకు స్కెచ్

## - తెలంగాణపై బీజేపీ గట్టి ప్లాన్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రాకుండా ఉండేందుకు బీజేపీ ప్లాన్ గట్టిగానే రెడీ చేసింది. ఇప్పటికే 21 రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన బీజేపీ దక్షిణాదిన ఉన్న మరో రాష్ట్రం తెలంగాణను కూడా సొంతం చేసుకోవాలని స్కెచ్ వేస్తుంది. ఎటూ వచ్చే ఎన్నికల్లో కర్ణాటకలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ నాయకత్వం అంచనా వేస్తుంది. తెలంగాణాలోనూ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఇక దక్షిణాదిన ఒక రాష్ట్రానికే కాంగ్రెస్ ను పరిమితంచేయాలన్న ఆలోచనలో ఉంది. కేరళలో గెలవడంతో ఆ పార్టీకి ఒక్క రాష్ట్రమే మిగిలనుంది. అందుకే తెలంగాణపై పార్టీ నాయకత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది.


### - అదే ప్లాన్ తో..

ఎన్నికలకు కొన్నేళ్ల ముందు నుంచే ఆ రాష్ట్రంలో అధికారంలో రావడానికి ఎప్పుడూ ప్రణాళిక సిద్ధం చేస్తుంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ లోనూ ఇదే ప్లాన్ ను బీజేపీ అమలు చేసింది. అదే ప్లాన్ ను తెలంగాణలోనూ అమలు చేయాలని బీజేపీ కేంద్ర నాయకత్వం సిద్ధమయింది. రాష్ట్ర నాయకత్వంతో సంబంధం లేకుండా బీజేపీ కేంద్ర నాయకత్వమే అన్ని బాధ్యతలను తీసుకునే దిశగా అడుగులు వేయనుంది. అందులో భాగంగానే నేడు ప్రధాని మోదీ పర్యటన ఉందన్నది కూడా అంతేవాస్తవం. దాదాపు తొమ్మిది వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు మోదీ ప్రారంభోత్సవాలు, శంకకుస్థాపనలు చేయనున్నారు.

### - రానున్న మూడేళ్ల కాలంలో..

ఇక రానున్న మూడేళ్ల కాలంలోనూ ప్రతి వారం ఒక కేంద్ర మంత్రి పర్యటించాలన్న డెయిరీని కేంద్ర నాయకత్వం సిద్ధం చేసింది. రాష్ట్ర నాయకత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు ఓటు బ్యాంకును మరింత పటిష్టం చేసుకోవడం కోసం బీజేపీ కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగనుంది.

ఈ మేరకు రాష్ట్ర నాయకులు ఇక ఉత్సవ విగ్రహాలుగా మారనున్నారు. కేంద్ర నాయకత్వం ఇచ్చే బాధ్యతలను, పిలుపు నిచ్చే కార్యక్రమాలను అమలు చేయడమే రాష్ట్ర నాయకత్వం చేయాల్సి ఉంటుంది. అందుకే రానున్న కాలంలో అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు కూడా పర్యటించి తెలంగాణలో అధికారంలోకి వచ్చే దిశగా ప్లాన్ చేస్తున్నారు. రాష్ట్ర నాయకత్వం ప్రమేయం లేకుండానే తెలంగాణలో పాగా వేసేందుకు కమలనాథులు పావులు కదుపుతున్నారు.




# రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

## - ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భూముల ధరలను సవరించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అలాగే పనివేళలు సవరించాలని కూడా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్లకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక రద్దీ ఉన్న చంపాపేట, సరూర్ నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, షాద్ నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, ఫరూఖ్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు పని వేళలను 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు చెప్పారు. ఈ 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవసరమైతే మరింత సమయాన్ని పెంచుతామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని పెంచాలని సూచించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలను సమన్వయం చేసుకోవాలని మంత్రి అన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588